J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 41 13.3.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

• మేలుకోకుంటే కోలుకోవడం కష్టమే

# సజ్జల సమన్వయం.. వైసీపీలో అయోమయం



పార్టీ మూడడుగులు ముందుకీ.. ఆరడుగులు వెనక్కి

* ద్వితీయ శ్రేణి నాయకత్వం కరువు
* పార్టీకి రామకృష్ణారెడ్డి పెద్ద బరువు
* జగన్ పక్కనే చేరి పొగడ్తల దరువు

ఆంధ్రాలో ఇప్పటికిప్పుడే ఎన్నికలు జరిగితే సీన్ రివర్స్ అవుతుందని, వైసీపీ మళ్ళీ అధికారంలోకి వస్తుందని జనం చెప్తున్న జోస్యం. అయితే, వైసీపీ శ్రేణులు మాత్రం జన జోస్యంతో ఏకీభవించడం లేదు. తమ నాయకుడికి జనంలో ఆదరణ వున్నా, ఆయన తీసుకునే నిర్ణయాలలో స్పష్టత లేదని.. కాబట్టి పార్టీ గెలుపు అంత ఈజీ కాదని ఆ పార్టీ నాయకులు వాపోతున్నారు. అధికారంలో ఉన్నన్ని రోజులూ సలహాదారుల సారథ్యంలో పాలన సాగిందని.. ఆ ఫలితమే తాము *11* సీట్లకి పరిమితమైపోయామని అంటున్నారు. ఇప్పుడు కూడా ఆ సలహాదారుడి పెత్తనమే పార్టీకి గుదిబండగా మారిందని ఆవేదన చెందుతున్నారు.

2లో



# జగజ్జేత.. భారత్

» మూడోసారి ప్రపంచ విజేతగా నిలిచిన సూర్య సేన

» ఐసీసీ వైట్‌బాల్ టోర్నీలలో ఎదురులేని టీం ఇండియా

2లో



పాఠకులకు, ప్రకటనకర్తలకు,
మిత్రులకు, చందాదారులకు
శ్రీ పరాభవ నామ సంవత్సర
ఉగాది శుభాకాంక్షలు
సం/-



అభినందన శుభాకాంక్షలు

మాకు అత్యంత ఆప్తులు, ఆత్మీయులు,
AMR సంస్థల ఛైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్
**ఆల్తూరు మహేష్‌రెడ్డి** గారు
వ్యాపార, ఆధ్యాత్మిక, సేవారంగాలలో
వారందించిన సేవలకి గుర్తుగా
105 సంవత్సరాల సుధీర్ఘ చరిత్ర కలిగిన
పూణెలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయం
**తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్** వారు
మార్చి 14 శనివారం నాడు
ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న
**గౌరవ డాక్టరేట్**
అందుకోనున్న ఆనంద తరుణంలో
మా అభినందన శుభాకాంక్షలు.

# సజ్జల సమన్వయం.. వైసీపీలో అయోమయం

(మొదటిపేజీ తరువాయి)

'సజ్జల రామకృష్ణారెడ్డి' జగన్‌కి అత్యంత సన్నిహితుడు. ఈ ఒక్క సాన్నిహిత్యాన్ని అడ్డం పెట్టుకుని వైఎస్సార్‌సీపీని ఏకఛత్రాధిపత్యంగా ఏలేస్తున్నాడు. సమన్వయకర్త పేరుతో కార్యకర్తలను చెడుగుడు ఆడేస్తున్నాడు. జగన్ ముందు ఒకలా, నాయకుల ముందు మరోలా, కార్యకర్తల ముందు ఇంకోలా జిమ్మిక్కులు చేస్తూ, పార్టీని అథః పాతాళానికి నెట్టేస్తున్నాడు. 2019 – 24 మధ్యకాలంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అటు పార్టీలోనూ, ఇటు ప్రభుత్వంలోనూ చక్రం తిప్పాడు. తన కుమారుడిని సోషల్‌మీడియా ఇన్‌చార్జిగా నియమించి తాను ఏం చేసినా అడిగేవారే లేరన్నట్లుగా రెచ్చిపోయాడు. పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని సైతం డమ్మీని చేసి సర్వం తానే అన్నట్లుగా వ్యవహరించాడు. ఫలితం గత ఎన్నికల్లో పార్టీ పదకొండు సీట్లకు పడిపోయింది. ఇంత జరిగినా అధినేత కళ్లకు గంతలు కట్టేసి ఇప్పటికీ సజ్జలే పార్టీలో పెత్తనం చెలాయించేస్తున్నాడు.

కూటమి ప్రభుత్వ తప్పుల కారణంగా ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే రాష్ట్రంలో సీన్ రివర్స్ అవుతుందని, జగన్‌కు జనం జేజేలు పలికి బ్రహ్మరథం పడతారనేమాట సర్వత్రా వినిపిస్తోంది. అయినా, సగటు వైఎస్సార్‌సీపీ కార్యకర్త మాత్రం దీన్ని నమ్మడం లేదు. ఎందుకంటే జగన్ పక్కన శకునిలా చేరి అధినేతకు, మిగతా నాయకులకు మధ్య అసలు సమన్వయమే లేకుండా చేస్తున్న రాష్ట్ర సమన్వయకర్త సజ్జలను అధిష్ఠానం ఇంకా నమ్ముతుండడమే అందుకు ప్రధాన కారణమంటున్నారు. ఇప్పటికైనా జగన్ దూరదృష్టితో ఆలోచించి దుష్ట శక్తి వంటి రామకృష్ణారెడ్డిని దూరం పెడితేనే పార్టీకి భవిష్యత్ ఉంటుందని వారు స్పష్టం చేస్తున్నారు. అన్నీతానై, అంతటా తానై వ్యవహరిస్తూ, పార్టీ వ్యూహాలపేరుతో, సొంత పనులను చక్కబెట్టుకోవడం సజ్జల నైజమని, మేకవన్నె పులివంటి సజ్జలను నమ్మి నెత్తిన పెట్టుకోవడం కంటే, ఘోర తప్పిదం మరొకటి లేదని వారు తేల్చి చెప్తున్నారు. ఇప్పటికే వైసీపీని వీడి బయటకి వచ్చేసిన నాయకులందరూ సజ్జల సలహాలూ, సమన్వయమే జగన్ కొంప ముంచిందని సజ్జలపై బండలువేసి మరీ పార్టీ నుండి బయటకి వచ్చేసారు.

## ఐదేళ్లు ఆంధ్రా శశికళ తరహాలో!

'శశికళ' తమిళనాడులో ఈ పేరు తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే అన్నాడీఎంకే అధినేత్రి, పురుచ్చి తలైవి జయలలిత వద్ద పనిమనిషిగా చేరి, తర్వాత ఆమెను పూర్తిగా బందీని చేసి, మన్నార్‌గుడి మాఫియా పేరుతో రాష్ట్రాన్నే కబళించిన కిలాడీ లేడీ శశికళ. తమ వారిని అందలమెక్కించి, చివరికి రాజ్యాంగేతర శక్తిగా మారి ప్రభుత్వాన్ని, పార్టీని శాసించింది. జయలలిత మరణశయ్యపై ఉన్న సమయంలోనూ మరొకరు ఆమెను కలవకుండా పేట్రేగిపోయింది. ఇదే తరహాలో ఆంధ్రాలో జగన్ వద్ద తొలుత అమాయకుడిలా చేరి ఆ తర్వాత ప్రధాన సలహాదారుడి పాత్రలో నటనాభినయాన్ని పండిస్తూనే, "ఇందుగలడందు లేడన్న సందేహము వలదన్నట్లు"గా సకలశాఖల మంత్రిగా, సర్వాంతర్యామిగా సజ్జల ఎదిగారు. కుబుసం విడిచిన పాములా, తొలుత స్తబ్దుగా ఉంటూ ఆ తర్వాత చెలరేగిపోయారు. అందరివాడిగా పేరు తెచ్చుకున్న జగన్‌ని ఎవరికీ అందుబాటులో లేకుండా చేశారు. చివరికి ఎమ్మెల్యేలు, ఎంపీలు, కీలక నాయకులకు కూడా జగన్ అపాయింట్‌మెంట్ దొరకకుండా చేయగలిగే స్థాయిలో ఆరితేరారు. అధినేత చుట్టూ ఓ కోటరీ ఏర్పాటు చేసి అందరినీ దూరం చేశారు. ఫలితంగా పార్టీ ఏకంగా 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయింది. లక్షల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల పేరుతో పంచినా, చాలాచోట్ల డిపాజిట్లు కూడా రాని పరిస్థితికి పార్టీ పడిపోయింది. గెలిచిన ఆ 11 మంది కూడా బొటాబొటి మెజారిటీతో గట్టెక్కిన వారే కావడం గమనార్హం.

## బాబాయిని పరిమితం చేసి అబ్బాయిని స్తుతిస్తూ!

నిజానికి ప్రారంభంలో విజయసాయి రెడ్డి పార్టీలో నంబర్–2గా ఉంటూ పెత్తనం చెలాయించేవారు. ఆ తర్వాత క్రమంగా ఆ స్థానానికి పోటీపడిన మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి లాంటివారిని పక్కకు తప్పించి సజ్జల రామకృష్ణారెడ్డి చక్రం తిప్పడం ప్రారంభించారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సజ్జల పేట్రేగిపోయారు. చివరికి పాలనకు జోడు గుర్రాలుగా చెప్పుకునే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కూడా ముఖ్యమంత్రిని కలవాలంటే సజ్జల పర్మిషన్ తీసుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని గ్రహించి జగన్ బాబాయి వైవీ సుబ్బారెడ్డి వంటివారు సైతం ఏం చేయలేక మౌనంగా ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పైగా ఆయన్ని టీటీడీ ఛైర్మన్‌ను చేసి అటు పార్టీకి, ఇటు ప్రభుత్వానికి దూరం చేశారన్నది జగమెరిగిన సత్యం. దీంతో క్షేత్రస్థాయి పరిస్థితులని జగన్‌కు తెలియజేసే వారే కరువయ్యారు. సరిగ్గా ఇలాంటి సమయంలోనే సజ్జల అండ్ కో జగన్‌ను ఆహా, ఓహో అంటూ కీర్తించడం, మనకు తిరుగులేదంటూ నమ్మించి, రాష్ట్రంలో ఎక్కడా పర్యటించకుండా తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితం చేయడం, చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో కూడా మనమే గెలుస్తామంటూ బీరాలు పలకడం, వంటి విషయాలతో అధినేతకు నిత్యం తప్పుడు సమాచారం అందిస్తూ, ఘోర పరాజయానికి కారణమయ్యారు. ఇక జగన్ కూడా సజ్జల వంటి సలహాదారుల సారథ్యంలో పాలన సాగించి భారీ మూల్యమే చెల్లించుకున్నారు. ఫలితంగా చివరికి ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేక అవమానాల పాలయ్యారు. ఓవైపు హస్తినలో, మరోవైపు హైదరాబాద్‌లో, ఇంకో వైపు కుటుంబం లోనూ పలకరించవారే కరువై ఒంటరిగా మిగిలిపోయారు.

## ఇంతజరిగినా కళ్లు తెరవరా?

నాయకుడు తన సైన్యంగా భావించే కార్యకర్తలను, నాయకులు, సలహాదారులు, సమన్వయకర్తలకు ప్రాధాన్యం ఇవ్వడంలో తప్పులేదు. తన వెంట నడిచే వారిని నమ్మడంలోనూ తప్పిదం లేదు. వారిపై నమ్మకం, విశ్వసనీయత కచ్చితంగా పెట్టుకోవాల్సిందే. అయితే సలహాల పేరుతో కనిపించినప్పుడల్లా సాగిలపడడం, సూచనల పేరుతో పార్టీని కబళించడం, ఇతరులెవ్వరినీ కలవకుండా, క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించకుండా, అటు నాయకులకు, ఇటు ప్రజలకు దూరం చేస్తున్న కోటరీ నైజాన్ని గుర్తించి దాన్ని బద్దలు కొట్టాల్సిన బాధ్యత మాత్రం అధినాయకుడికే ఉంటుంది. ఆంధ్రలో జగన్‌కి బద్ధశత్రువువైన చంద్రబాబు తెలంగాణలో శత్రువుకు మిత్రుడైన రేవంత్‌రెడ్డి మరింతగా వేళ్లూనుకుంటున్నా, హస్తినలో నా అనేవారు కరువైనా, ఈ దుస్థితికి కారణం సజ్జల వంటి వారే అని తెలిసినా జగన్ మాత్రం ఇప్పటికీ తన తీరు మార్చుకోవడం లేదంటే, ఖచ్చితంగా అది ఆయన స్వయంకృతాపరాధం గానే భావించాల్సి ఉంటుంది. వాస్తవంగా ఆయన చుట్టూ చేరి ఉన్నవి లేనివి చెప్పి పబ్బం గడుపుకునే కోటరీ వల్లే సింహం సింగిల్‌గా వస్తుందన్న జగన్, సింగిల్ డిజిట్‌కి దగ్గరగా చేరిపోయారన్నది జగమెరిగిన సత్యం. ఇంత జరిగినా జగన్‌కి వాస్తవం బోధపడకపోగా, రాష్ట్ర కో–ఆర్డినేటర్ పేరుతో సజ్జలకే మళ్లీ పెత్తనం ఇచ్చి మహా తప్పిదానికి పాల్పడుతున్నారని సగటు వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందరినీ సమదృష్టితో చూడాల్సిన అధినేత, కొందరి మాటలనే ఆలకిస్తూ, కొందరినే దగ్గర తీస్తూ, కొందరికే ప్రాధాన్యమివ్వడం ఏమాత్రం సహేతుకం కాదని వాపోతున్నారు. అయినా అధినేతకు చెప్పే ధైర్యంలేక, చెప్తే ఏమౌతుందో అనే ఆందోళనతో వారంతా అంతర్మథనం చెందుతున్నట్లు సమాచారం. మరికొందరు ఏదేమైనా కానీ అనే తరహాలో కోటరీకి ఎదురు నిలిచి చివరికి పార్టీకే దూరమయ్యే పరిస్థితి కూడా తెచ్చుకున్నారు. దీంతో తమ అధినేత వాస్తవ విషయాలను, క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పుడు తెలుసుకుంటారో, పార్టీకి ప్రజల్లో మళ్లీ ఎప్పుడు ఆదరణ లభిస్తుందోనని హార్డ్‌కోర్ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా పార్టీ కోసం శ్రమిస్తూ, అందరికీ అందుబాటులో వుండే వైవీ సుబ్బారెడ్డి వంటి సీనియర్లకి పార్టీలో ఎప్పుడు ప్రాధాన్యత కల్పిస్తారో తెలియక అయోమయంలో పడిపోతున్నారు.

## మేలుకోకుంటే కోలుకోవడం కష్టమే!

సర్వం సజ్జలమయంగా మారిన వైఎస్సార్‌సీపీ మళ్లీ పునరుజ్జీవం పొందాలన్నా, ప్రజల అభిమానం చూరగొనాలన్నా, భారీ మార్పులు తప్పనిసరి అన్నది ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల భావన. ముఖ్యంగా సజ్జల వంటివారి విషయంలో జగన్ పునరాలోచించాల్సిన సమయం ఆసన్నమైందని వారు సూచిస్తున్నారు. తప్పులను ఎప్పటికప్పుడు సరిదిద్దుకోకుంటే ఏ రంగంలో అయినా విజయవంతం కావడం కష్టమని, రాజకీయ రంగంలో ఇది మరింత ముఖ్యమని హితబోధ చేస్తున్నారు. నాయకులు తమకు వచ్చిన అవకాశాలను జారవిడుచుకుంటే, సమర్థులైన సహచరుల ప్రతిభను గుర్తించకుంటే, భవిష్యత్‌కు ఏది మంచిదో, ఏది చెడ్డదో గ్రహించకుంటే మరోసారి విజయలక్ష్మి దూరం కావడం తథ్యమని హెచ్చరిస్తున్నారు. ఎల్లకాలం అసమర్థులను పక్కన పెట్టుకుని, శకుని లాంటివారిని చేరదీస్తే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విషవలయం లాంటి కోటరీనీ, దాన్ని లీడ్ చేస్తున్న సజ్జలను పార్టీ నుంచే సాగనంపాల్సిన అవసరం ఉందని ఖరాకండిగా తేల్చి చెప్తున్నారు. ఇప్పటికే జరగాల్సిన నష్టం అంతా జరిగిపోయిందని, ఇకనైనా మేలుకోకుంటే కోలుకోవడం కష్టమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ముఖంలో ఆకర్షణ, మాటల్లో స్పష్టత లేని, చేతల్లో నిజాయితీలేని సజ్జల వంటి వారిని పక్కన పెట్టకుంటే పార్టీకి మరోసారి పరాభవం తప్పదని, కీలక నాయకులు కూడా పార్టీలో కొనసాగే పరిస్థితి ఉండదని స్పష్టం చేస్తున్నారు. మరి వైఎస్సార్‌సీపీ కేడర్ చేస్తున్న సజ్జల వ్యతిరేక ఆర్తనాదాలు జగన్ గుర్తిస్తారో, లేక పరాజితుడి చేతికే మరోసారి కత్తిచ్చి యుద్ధం గెలిచేందుకు బరిలో దిగుతారో వేచిచూడాలి...!

# జగజ్జేత.. భారత్

- మూడోసారి ప్రపంచ విజేతగా నిలిచిన సూర్య సేన
- ఐసీసీ వైట్‌బాల్ టోర్నీలలో ఎదురులేని టీం ఇండియా

***ప్రపంచ క్రికెట్‌లో మరోసారి భారత్ తన సత్తాచాటింది. ముచ్చటగా మూడోసారి టీ–20 ప్రపంచకప్‌ను ముద్దాడి భారతావని పులకించింది. కోట్లాదిమంది అభిమానుల హర్షధ్వానాలు, ఆకాంక్షల నడుమ సూర్యా బృందం పక్కా ప్రణాళికతో, అసమాన ప్రతిభతో ప్రపంచకప్‌ను దక్కించుకుంది. తద్వారా వరుసగా రెండోసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఓ ఆతిథ్య దేశం రికార్డుస్థాయిలో ఘనవిజయం సాధించి జగజ్జేతగా అవతరించింది. ఈ ఘనవిజయం ద్వారా మరో దశాబ్దం కూడా మాదే అనేలా ప్రత్యర్థి జట్లకు బలమైన సంకేతాలను పంపించింది.***

ప్రారంభానికి ముందు అనేక వివాదాలకు కారణమైన ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్‌కప్ ఘనంగా ముగిసింది. టోర్నీ ఆరంభానికి ముందే భారత్‌లో ఆడబోమంటూ బంగ్లాదేశ్ టీం గిల్లిగజ్జాలు మొదలుపెట్టింది. దీంతో చివరికి ఐసీసీ పెద్దలు ఆ జట్టును టోర్నీ నుంచే తప్పించారు. దీన్ని వ్యతిరేకిస్తూ భారత్ లీగ్ మ్యాచ్ ఆడబోమంటూ పాకిస్థాన్ జట్టు ఓవర్ యాక్షన్ చేసింది. అయితే, ఐసీసీ ఆగ్రహం వ్యక్తం చేయడంతో భారత్‌తో మ్యాచ్ ఆడి, చివరికి ఘోరపరాజయాన్ని మూటగట్టుకుంది. ఇక భారత్ జట్టు వరుస ఘన విజయాలతో తుది పోరుకు అర్హత సాధించడమే కాకుండా, అద్భుత పోరాటపటిమ, అశేష అభిమాన సందోహం మధ్య టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడిపోయి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు, సంజుశాంసన్, అభిషేక్‌శర్మ, ఇషాన్ కిషన్, శివమ్ దూబే రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 255పరుగుల భారీస్కోర్‌ను సాధించింది. 256 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ వరుస క్రమంలో వికెట్లు కోల్పోవడంతో ఏ దశలోనూ భారత్ జట్టుకు పోటీ ఇవ్వలేకపోయింది. 159 పరుగులకు ఆలౌట్ అయ్యి రన్నరప్‌గా నిలిచింది. భారత బౌలర్లలో బూమ్రా నాలుగు వికెట్లతో న్యూజిలాండ్ బ్యాటింగ్ ఆర్డర్‌ను కకావికలం చేశాడు. అతడికి తోడుగా అక్షర్‌పటేల్ కూడా న్యూజిలాండ్ బ్యాటర్ల భరతం పట్టి మూడు వికెట్లు సాధించాడు. ఇక పాండ్యా, వరుణ్ చక్రవర్తి, అభిషేక్‌శర్మ తలో వికెట్ సాధించారు. కాగా, టోర్నీమొత్తం అసమాన బ్యాటింగ్ ప్రతిభతో భారత్‌కు విజయాలను అందించిన వికెట్ కీపర్ సంజూశ్యాంసన్‌కు ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ అవార్డు దక్కింది. అలాగే మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు జస్ప్రీత్ బూమ్రాను వరించింది.

## రికార్డులే రికార్డులు!

మూడోసారి వరల్డ్ కప్ కైవసం చేసుకుని ప్రపంచ రికార్డు సృష్టించిన భారత జట్టు ఫైనల్స్‌లో సాధించిన ఏకపక్ష విజయంతో అనేక మైలురాళ్లను సాధించింది. 2007 ధోనీ సారథ్యంలోనూ, 2024లో రోహిత్‌శర్మ నాయకత్వంలోనూ, 2026లో సూర్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రపంచ చాంపియన్స్‌గా నిలిచింది. తద్వారా మరో జట్టు సాధించని ఘనతను సొంతం చేసుకుంది. కాగా టీ20 ప్రపంచకప్‌ను ఇప్పటివరకు ఏ ఆతిథ్య దేశం కూడా దక్కించుకోలేదు. కానీ, భారత్ తొలిసారి ఆ రికార్డును కొల్లగొట్టింది. వరుసగా రెండుసార్లు టైటిల్ దక్కించుకున్న తొలి జట్టుగా నిలిచింది. భారత్ చేసిన 255 పరుగులు టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో నమోదైన అత్యధిక స్కోరు కావడం విశేషం. భారత్ సాధించిన 96 పరుగుల విజయం (పరుగుల పరంగా) అతిపెద్ద గెలుపు కావడం గమనార్హం. ఇక సంజూశాంసన్ చేసిన 321 పరుగులు ఓ ఐసీసీ టోర్నీల్లో భారత ఆటగాడు చేసిన పరుగులు కావడం, ఫైనల్స్‌లో అతడు చేసిన 89 పరుగులు టీ20 ఫైనల్స్‌లో ఓ ఆటగాడు చేసిన అత్యధిక స్కోరుగా కావడం విశేషం. టీ20 ప్రపంచకప్ చరిత్రలో భారతజట్టు తరపున 40 వికెట్లు తీసిన బౌలర్‌గా బూమ్రా నిలిచాడు. ఇక ఫైనల్ మ్యాచ్‌లో 18 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించిన అభిషేక్ శర్మ 2026 ప్రపంచకప్‌లో వేగవంతమైన ఆఫ్ సెంచరీ చేసిన బ్యాట్స్‌మెన్‌గా రికార్డు సృష్టించాడు. ఇక వైట్‌బాల్ ఐసీసీ టోర్నమెంట్‌లలో 14సార్లు విజేతగా నిలిచి భారత్ తొలిస్థానంలో ఉండగా, 13సార్లు విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా రెండోస్థానానికి పడిపోయింది.

## సర్వత్రా సంబరాలు, శుభాకాంక్షలు!

అపూర్వ విజయంతో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన భారత జట్టుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ నుంచి సాధారణ అభిమానుల వరకు శుభాకాంక్షల వెల్లువ కనిపించింది. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కూడా భారత్ విజయంపై హర్షం వ్యక్తం చేశారు. చరిత్ర సృష్టించిన భారత్ మరిన్ని విజయాలు సాధించి అప్రతిహత జైత్రయాత్రను కొనసాగించాలని రాష్ట్రపతి ఆకాంక్షించగా, మరే జట్టు సాటిరాని రీతిలో భారత్ అపురూప విజయాలు సాధించాలని మోదీ పిలుపునిచ్చారు. భారత దిగ్గజాలు సునీల్ గవాస్కర్, సచిన్, ధోని, విరాట్ కోహ్లి ట్విటర్‌లో శుభాకాంక్షలు తెలిపారు. ఇక దేశమంతా అభిమానులు వీధుల్లోకి వచ్చి నృత్యాలు చేస్తూ భారత జట్టు విజయాన్ని ఆస్వాదించారు. కోట్లాదిగా నెటిజన్లు భారతజట్టుకు విషెస్ చెబుతూ పోస్టులను హోరెత్తించారు...!

# సూపర్ సిక్స్ పథకాలు..

# సూపర్ హిట్

## • మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



రైతులకు పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు ఎవరూ ఊహించని విధంగా సూపర్ హిట్ అయ్యాయని, ప్రజలు వాటిపట్ల ఎంతో ఆదరణ చూపుతున్నారని రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. చేజర్ల మండలం యనమదల గ్రామంలో ఈనెల 10న ఆయన ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీచేసి, గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు భూ హక్కులపై పూర్తి భద్రత కల్పించేందుకే ప్రభుత్వ రాజముద్రతో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం, యనమదల గ్రామ పంచాయతీలో రూ.18 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. అదేవిధంగా 6 గోకులం షెడ్ల నిర్మాణాలకు మంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. శ్రీ గంగమ్మతల్లి దేవస్థానం ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆ ఆలయానికి అనుబంధంగా ముఖమండపం-భజన మందిర నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ నాయకుల అభ్యర్థన మేరకు చేజర్ల మండల కేంద్రంలో షాదిమంజిల్ ఏర్పాటు చేస్తామన్నారు.

### ప్రజల ఆరోగ్యం కోసం..కోట్లాది రూపాయల సీఎం సాయం

పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ, ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 10న చేజర్ల మండలం యనమదల గ్రామంలో చేజర్ల మండలానికి చెందిన లబ్ధిదారులకు రూ.8,53,631 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ, తమ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 742 కుటుంబాలకు 6.94కోట్ల రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందించినట్లు చెప్పారు.

# దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్‌యార్డ్!

## • జువ్వలదిన్నెలో శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్

దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్‌యార్డ్ నెల్లూరుజిల్లాలో ఏర్పాటు కాబోతోంది. కావలి నియోజకవర్గంలోని జువ్వలదిన్నెలో ఈ అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ఈనెల 12వతేదీన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. తొలిదశలో రూ.45కోట్ల పెట్టుబడితో, వెయ్యిమందికిపైగా ఉద్యోగాల కల్పన లక్ష్యంగా దీని ఏర్పాటు జరుగుతోంది. దీంతో, దేశీయ రక్షణ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడంతో పాటు దేశ సముద్ర సాంకేతిక సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో కీలకమైన ముందడుగు పడినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ సెంటర్‌ను అభివృద్ధి చేయనుంది. తొలుత అక్కడ ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ప్రాజెక్ట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం జువ్వలదిన్నె పిషింగ్ హార్బర్ వద్ద మొదటి దశ కింద 29.58 ఎకరాల భూమిని కూటమి ప్రభుత్వం లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఇందులో 7.58 ఎకరాల వాటర్ ఫ్రంట్ ల్యాండ్ కూడా ఉంది. 2026 నవంబర్ నాటికి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఈ ప్రాజెక్ట్ మొత్తం 200 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నారు. షిప్ బిల్డింగ్, అటానమస్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్, మెరైన్ ఇంజనీరింగ్, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి. ఈ ప్రాజెక్ట్ బ్లూ ఎకానమీ, మారిటైం ఇన్నోవేషన్‌ను బలోపేతం చేయడంతో పాటు ఏపీని మారిటైం




అటానమస్ మారిటైం షిప్‌యార్డ్‌కి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారా లోకేష్

రోబోటిక్స్, అటానమస్ షిప్ బిల్డింగ్ హబ్‌గా నిలపనుంది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌కు బోగోలు మండలం కప్పురాల తిప్ప వద్ద ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంతిరెడ్డి, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజలు స్వాగతం పలికారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, పి.సునీల్ కుమార్, ఎన్.విజయశ్రీ, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు బీద రవిచంద్రయాదవ్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బల్లి కల్యాణ చక్రవర్తి, సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, సీఈవో కెప్టెన్ నికుంజ్ పరాశర్, సీహెచ్ ఆర్వో శ్రీమతి సన్యుక్తా సింగ్, ఆర్కేపీ సింగ్ పాల్గొన్నారు.

# ఆల్తూరు మహేష్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్



ప్రముఖ వ్యాపారవేత్త, ఆధ్యాత్మికతత్పరులు, సమాజ సేవకులు ఏ.యం.ఆర్. సంస్థల చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ మన నెల్లూరీయులు ఆల్తూరు మహేష్‌రెడ్డిని గౌరవ డాక్టరేట్ వరించబోతోంది. లోకమాన్య బాల గంగాధర్ తిలక్ పేరుతో 1921లో అంటే 105 సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్ విశ్వ విద్యాలయం మహేష్‌రెడ్డిని ఈ డాక్టరేట్‌తో సత్కరించబోతోంది. మార్చి 14వతేదీ శనివారం నాడు పూణెలోని సంస్థ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకి జరుగనున్న విద్యాలయ 44వ స్నాతకోత్సవంలో మహేష్‌రెడ్డి గౌరవ డాక్టరేట్‌ని అందుకోనున్నారు. ఆయనతో పాటు గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్, ప్రపంచ ప్రఖ్యాత చెఫ్ హేమంత్ ఒబెరాయ్‌లు కూడా ఈ డాక్టరేట్‌లని అందుకోబోతున్నారు.

# కార్పొరేషన్‌లో..దడ పుట్టిస్తున్న ఏసీబీ తనిఖీలు!

## ➢ అక్రమార్కుల గుండెల్లో రైళ్లు ➢ కీలక రికార్డులు స్వాధీనంతో బెంబేలు



***నేతిబీరకాయలో నెయ్యెంత ఉంటుందో..మన మునిసిపాలిటీల్లో చిత్తశుద్ధి కూడా అంతే ఉంటుంది. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఎంతోకాలంగా అవినీతి అక్రమాలకు కేంద్రాలుగా మారిపోయాయి అన్నది సర్వత్రా వినిపిస్తున్న మాటే. వేలకు వేలు, కొంతమందైతే లక్షలకు లక్షలు జీతాలు తీసుకుంటూనే, ప్రజల నుంచి అందినకాడకి దోచుకోవడం 'మామూలై'పోయింది. ఆమ్యామ్యాలు లేకుండా, బల్లకింద చెయ్యిపెట్టకుండా నీతిగా పనిచేసేవారు ఏ కొద్దిమందో ఉంటున్నారు.***

ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం మునిసిపాలిటీల్లోని అక్రమార్కుల భరతం పట్టడానికి సన్నద్ధమైంది. ఏసీబీ కొరడా ఝుళిపిస్తూ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఒక్కసారిగా మునిసిపాలిటీలు, ముఖ్యంగా అవినీతి జలగలు ఎక్కువగా ఉండే టౌన్ ప్లానింగ్ విభాగాలపై దాడులు చేస్తోంది. దీంతో అవినీతిపరులు బెంబేలెత్తిపోతున్నారు. మంగళవారం ఉదయం నుంచి నెల్లూరు నగరపాలక సంస్థ (కార్పొరేషన్)లో ఏసీబీ అధికారులు తనిఖీలు ముమ్మరం చేయడంతో ఎక్కడ పట్టుబడతామేమోనని అనేకమంది ఉద్యోగులు సెల్‌ఫోన్‌లు స్విచ్‌ఆఫ్ చేసేసి సమాచారం దొరక్కుండా జాగ్రత్తపడుతున్నారు.

నెల్లూరు నగరంలో కార్పొరేషన్‌లో ఉద్యోగం దొరికిందంటే బంగారు గని దొరికినట్లే. ఇక్కడ అక్రమాలకి, అవినీతికి అంతే ఉండదు. అనేక భవనాలకి, దుకాణాలకి, షాపింగ్‌కాంప్లెక్స్‌లు వగైరాలకి మార్కెట్‌ధర ప్రకారం కార్పొరేషన్‌కి చెల్లించాల్సిన డబ్బుని, అధికారులు, సిబ్బంది అంతా కుమ్మక్కై తినేయడం ఎంతో కాలంగా జరుగుతున్నదే. నగరంలో అక్రమ కట్టడాలకి అనుమతులివ్వడం, అందుకు లక్షలకి లక్షలు లంచాలుగా గుంజుకోవడం వంటివాటిపై కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంపై గతంలో కూడా ఎన్నో ఆరోపణలొచ్చాయి. అయినా, పట్టించుకునే నాథులు లేకపోయారు. దీంతో, ఏళ్ళ తరబడిగా లంచాలకి మరిగి, కూర్చున్న సీటును వదలకుండా, నాయకులు..లేదా తమ పై అధికారులతో పైరవీలు చేసుకుని, అక్రమంగా కోట్లకి కోట్లు సంపాదించడం, బినామీల పేర్లతో ఆస్తులు కూడగట్టుకోవడం వంటివి సాధారణమైపోయాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అలాంటి అవినీతి జలగల అంతుచూసేందుకు సమాయత్తం కావడం, ఏసీబీ అధికారులు రంగంలోకి దిగడంతో కార్పొరేషన్‌లోని అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. కార్పొరేషన్‌లోని ఉద్యోగుల పూర్వాపరాలు, వారి ఆర్థిక స్థితిగతులు, ఉద్యోగంలో చేరకముందు స్థితి, ఇప్పటి పరిస్థితి, ఎక్కడెక్కడ ఎన్నెన్ని అక్రమాలు జరిగాయి, ఎవరెవరు అక్రమ ఆస్తులని కూడగట్టుకుంటున్నారో కూడా ఏసీబీ అధికారుల తనిఖీల్లో బయటకు వస్తాయంటున్నారు. ఆర్థిక లావాదేవీలు, ఫోన్‌పేలు, బ్యాంక్ బ్యాలెన్స్‌లు పూర్తి స్థాయిలో తెలుసుకునేందుకు కూడా ఏసీబీ అధికారులు సమాయత్తమవుతుండడంతో అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

### కీలక రికార్డులు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు

నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ రామకృష్ణుడు, సీఐలు విజయకుమార్, వెంకటేష్‌ల బృందం మరింత లోతుగా రికార్డులు పరిశీలిస్తోంది. మంగళవారం తనిఖీల సందర్భంగా, టౌన్‌ప్లానింగ్ విభాగంలోకి వెళ్ళి తలుపులు మూసేసి మరీ ఏసీబీ అధికారులు పరిశీలనలు ప్రారంభించారు. అధికారులని, ఉద్యోగులను బయటకి వెళ్ళనివ్వకుండా ఫైళ్ళు, రికార్డులు, కంప్యూటర్లలోని వివరాలు అన్నీ తనిఖీ చేశారు. భవనాలకు అనుమతుల మంజూరులో జరుగుతున్న వ్యవహారాల లోగుట్టును బయటవేసేందుకు అన్ని వివరాలను క్షుణ్ణంగా రాబట్టినట్లు చెప్తున్నారు. ఎక్కడ అవినీతి జరిగిందో, ఏఏ సంవత్సరాల్లో ఏమేరకు కార్పొరేషన్‌కి రావాల్సిన డబ్బుని ఏ స్థాయిలో తినేశారో ఏసీబీ వారు ఆరా తీస్తున్నారని అంటున్నారు. వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో కూడా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. రికార్డులన్నీ క్షుణ్ణంగా పరిశీలించి వాటిలో కొన్ని కీలకమైన ఫైళ్ళు కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ తనిఖీలకి కూడా అలవాటుపడ్డ ముదుర్లు కార్పొరేషన్‌లో లెక్కలేనంతమంది ఉన్నారని, ఎంత ముమ్మర తనిఖీలు జరిగినా, తమను ఎవరూ ఏమీ చేయలేరంటూ తనిఖీల సమయంలో కార్పొరేషన్‌కి రాకుండా ఎగ్గొట్టేస్తున్నవారూ ఉన్నారు. అయినా, పట్టువదలని విక్రమార్కుల్లా ఏసీబీ అధికారులు అన్నికోణాల్లో ఈ అక్రమాల వెనుక ఉన్నవారందరిపై దృష్టి సారించారు. ఈ తనిఖీలు మరిన్ని రోజులు జరుగుతాయని కూడా అంటున్నారు. అయితే, ఇప్పటికే ఆయా విభాగాల్లోని కీలకమైనవారంతా అందుబాటులో లేకుండా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

లాయర్
మార్చి 13, 2026

# నదుల పరిరక్షణే.. జీవకోటికి సంరక్షణ!

సకల జీవరాశుల మనుగడ నదులపైనే ఆధారపడి ఉందన్నది అందరికీ తెలిసిందే. మానవాళికి అవసరమైన తాగు నీటిని అందించే అపారమైన జలనిధుల్లో నదులే ప్రధానమైనవి. అయితే, అలాంటి జీవనదులను కూడా పరిరక్షించుకోలేక, మనిషి తన జీవన వ్యవస్థలను తానే నాశనం చేసుకుంటున్నాడు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది దాహార్తిని తీర్చేవి నదులే. నదులే లేకుంటే పంటపొలాలకు పచ్చదనం ఉండదు. నాగరికత విలసిల్లేది నదుల వల్లనేనన్నది కూడా అందరికీ తెలిసిందే. అందుకే, నదులు నాగరికతకు చిహ్నామని పెద్దలు చెప్తుంటారు. మనిషి ప్రాణాలను నిలబెట్టడమే కాక, ఇంకా అనేకరకాలుగా ఉపయోగపడుతున్న మన నదీమతల్లులను మనం పరిరక్షించుకోలేకపోతుండడం దురదృష్టకరం. దేశంలో ప్రధానంగా గంగా నది, గోదావరి, తుంగభద్ర, కృష్ణవేణి వంటి అనేక నదుల చెంతనే ఆధ్యాత్మిక కేంద్రాలు, ఆలయాలు కూడా ఎన్నో ఉన్నాయి. తద్వారా లక్షలాదిమంది ఉపాధి పొందుతుంటారు కూడా. పుష్కరాల వంటి వాటితో పవిత్రమైన నదులు మానవుడి జీవనభృతికి కూడా దారిచూపుతుంటాయి. అంతేకాదు, మానవజీవనానికి కీలకంగా ఉపయోగపడే వ్యవసాయం, రవాణా వంటివన్నీ ఎక్కువగా నదులపైనే ఆధారపడి జరుగుతుంటాయి. కోటానుకోట్ల టన్నుల చేపలు దొరికేది నదుల నుంచే. దీంతో మత్స్యపరిశ్రమకు కూడా ప్రధానాధారం నదులే. కానీ అలాంటి జీవజలాలను సైతం మనిషి తనకు తానే చేజేతులా ధ్వంసం చేసుకుంటూ, తన జీవితాన్ని తానే అస్తవ్యస్థం చేసుకుంటున్నాడంటే అతిశయోక్తి కాదు. నదుల్లోకి మురుగునీటిని వదిలేయడం, నదులకు అడ్డుకట్టలు వేసి ఆక్రమించుకుని ఇళ్ళు, భవనాలు కట్టుకోవడం వంటి చర్యలు నదులు కుంచించుకు పోవడానికి కారణాలవుతున్నాయి. మరోవైపు పెరుగుతున్న జనాభా, విపరీతమవుతున్న కాలుష్యం వంటివాటితో నదులు మురుగుప్రవాహాలవుతున్నాయి. నదులు, నదీపరీవాహక ప్రాంతాలు నానాటికీ మాలిన్యపు కోరల్లో చిక్కి విలవిలలాడుతున్నాయి. ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచంలోని అనేక నదులు కాలక్రమేణా అంతులేని కాలుష్యానికి గురవుతుండడంతో, జీవవైవిధ్యం కూడా దెబ్బ తింటోందని ఐక్యరాజ్య సమితితో పాటు, పర్యావరణ శాస్త్రవేత్తలు కూడా ఎంతోకాలంగా ఆందోళన చెందుతూనే ఉన్నారు. ప్రతినిమిషం అపారమైన నదీజలాలు సముద్రం పాలవుతూనే ఉన్నాయి. తమతో పాటు, మనం కుమ్మరించే మురుగునీటిని కూడా నదుల ద్వారా సముద్రానికి చేర్చి, సాగరాలను కూడా కాలుష్యభరితం చేస్తున్నాం. మనదేశంలో కూడా తాగునీటికి కటకటపడే ప్రాంతాలెన్నో ఉన్నా, నీటిని దుర్వినియోగం చేసుకోవడం మాత్రం ఆగడం లేదు. నీటి పొదుపు అనే మాటలు నీటిమూటలుగానే ఉంటున్నాయి తప్ప ఆచరణ శూన్యం. నీటి ప్రవాహాలు వచ్చే ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు కట్టుకోవడం ద్వారా నీటిని అదుపు చేసి పొదుపుగా వాడుకుంటే, అన్నివిధాలా ప్రయోజనం ఉంటుంది కానీ, ప్రభుత్వాలు అసలు అలాంటివాటి జోలికే వెళ్ళడం లేదు. ఒకవేళ అటువంటి వాటిని ఎక్కడైనా నిర్మించినా, కాలక్రమంలో వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో అనేకచోట్ల అవన్నీ నిరుపయోగంగానే ఉంటున్నాయి. ఆహారాన్ని అందించే పంట పొలాలకు, దాహం తీర్చుకునేందుకు, ఇతరత్రా ఇంటి అవసరాలకు అనునిత్యం నీళ్ళు కావాల్సి ఉన్నా, దేశంలో అవసరాలకి నీరందని కరువు ప్రాంతాలు లెక్కలేనన్ని ఉన్నా, నీటివనరులను..నదులను కాపాడుకోవడంలో నిర్లక్ష్యం వల్ల అధికశాతం నీటిని సముద్రాల పాలుచేసుకుంటూనే ఉన్నాం. దేశంలో సుమారు రెండువందలకు పైగా పెద్దపెద్ద నదులు ఉన్నా, మనిషి స్వార్థం, ధనాశ, పెరిగిపోతున్న అవినీతి వంటివి వాటి విధ్వంసానికి మూలమవుతున్నాయి. దీంతో మనదేశంలో నేటికీ స్వచ్ఛమైన మంచినీరు కూడా దొరక్క కోట్లాదిమంది ప్రజలు అల్లాడిపోతూనే ఉన్నారు. మరోవైపు నీళ్ళ వ్యాపారానికి రెక్కలు రావడం, వాటి ధరలు కూడా సామాన్యులకు అందని ద్రాక్షలా మారడంతో నీటిఎద్దడి తీవ్రంగా ఉండే ప్రాంతాల్లోని బీదా బిక్కీ ప్రజలు కలుషిత నీటినే తాగుతూ నానా రకాల బాధలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు, పాలకులు, ప్రజలు కళ్ళు తెరవాలి. నదుల రక్షణకు రక్షిత నీటి సరఫరా విభాగాలను పటిష్టం చేసి, అందరికీ స్వచ్ఛమైన నీరందించేందుకు కంకణబద్ధులు కావాలి. నదులను ప్రతిఒక్కరూ ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించాలి. మానవాళికి ప్రాణాధారమైన నదులు, ఉపనదులు, ఏర్లు, సెలయేర్లు, జలవనరులు ఎట్టిపరిస్థితుల్లోనూ కలుషితం కాకుండా కాపాడుకోవాలి. నదీజల రక్షణే జీవకోటి సంరక్షణగా భావిస్తూ ప్రతిఒక్కరూ నదులను కాపాడుకోవాలనే అవగాహనను ఇకనైనా పెంపొందించుకోవాలి.

**....(మార్చి 14 - అంతర్జాతీయ నదుల పరిరక్షణ దినోత్సవం)**

# అటకెక్కిన నెల్లూరు రైల్వేస్టేషన్ ఆధునీకరణ!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

"అమృత్ భారత్ స్టేషన్ పథకం" క్రింద 102కోట్ల అంచనాతో ఎంతో ప్రతిష్టాత్మకంగా మొదలుపెట్టిన మన నెల్లూరు రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు గత 18 నెలలుగా నత్తనడక నడుస్తున్నాయి. ఒక విధంగా చూస్తే.. పనులు అటకెక్కాయనే చెప్పొచ్చు. ఇప్పటికే 57శాతం పనులు పూర్తయ్యాయని, మరో ఆరు నెలల్లో పనులన్నీ పూర్తిచేసి ఆధునిక, అధునాతన స్టేషన్‌ని నెల్లూరు ప్రజలకి అంకితం చేస్తామని 2024 అక్టోబరులో రైల్వే అధికారులు అర్భాటంగా ప్రకటించారు. కానీ, ఆనాటి నుండి అతీగతి లేని చందంగా పనులు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రయాణీకుల కష్టాలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. మన జిల్లానుండి రాజ్యసభకు ఒకరు, లోక్‌సభకు ఇద్దరు మొత్తం ముగ్గురు ఎంపీలు ఉన్నారు. మన నెల్లూరు స్టేషన్‌ని అమృత్ భారత్ పథకంలో చేర్చడానికి కృషిచేసిన అప్పటి భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు గారు కూడా మన జిల్లా వాసే. వీరంతా దృష్టిపెడితే ఇది పెద్ద విషయం కాదు. అందరూ తల్చుకుంటే ఎలాంటి సమస్యనైనా చిటికెలో పరిష్కరించగలరు. ఈ అంశాన్ని వారి ప్రాధాన్యతాక్రమంలో ఉంచి, నిత్యం నెల్లూరు స్టేషన్ నుండి ప్రయాణం సాగిస్తున్న లక్షలాది మంది సామాన్య ప్రయాణికుల బాధలు తీర్చాలని కోరుకుంటున్నాం.

*డి. భరత్‌కుమార్‌రెడ్డి,*
**రంగనాయకులపేట, నెల్లూరు.**

# దివ్వెల, దువ్వాడల లాంటి వారిపై చర్యలు తీసుకోవాలి!

కలియుగ ప్రత్యక్ష దైవం సాక్షాత్తూ శ్రీ వెంకటేశ్వరస్వామి వారు కొలువైన అతి పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల. అటువంటి తిరుమలలో తాము వెళ్లిన ప్రతిసారీ తిరుమల తిరుపతి దేవస్థానాల నిబంధనలకి విరుద్ధంగా ప్రవర్తిస్తున్న దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురిలపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలి. వీరికివున్న ప్రోటోకాల్ సదుపాయాన్ని రద్దుచేయాలి. వీలయితే వీళ్ళిద్దరినీ తిరుమలకి రాకుండా నిషేధించాలి. గతంలో ఈ జంట తిరుమలలో రీల్స్ చేసి వార్తలలోకి ఎక్కారు. తాజాగా బిగ్‌బాస్ నటీమణి తనూజని తిరుమలకి తీసుకువెళ్ళి అక్కడ అతిథి గృహంలో తిరుమల నిబంధనలకు విరుద్ధంగా పుట్టినరోజు కేక్‌ని కట్ చేయించింది ఈ జంట. పైగా ఆమెకు ముద్దులు పెడుతూ ఆ వీడియోని సామాజిక మాధ్యమాలలో పోస్ట్‌చేసింది మాధురి. ఏదో ఒక విధంగా తాను వార్తలలో ఉండడం కోసం చేసే వెకిలి చేష్టలలో ఇవన్నీ ఓ భాగం. ప్రచార యావతో తమ స్వప్రయోజనాల కోసం ఇలా సిగ్గువిడిచి పవిత్ర దేవాలయాన్ని వేదికగా చేసుకుంటున్న మాధురి, శ్రీనివాస్‌లని క్షమించకూడదు. తిరుమలలో ఇలాంటివి చేయకూడదని తమకు తెలియదని మాధురి బుకాయించడం మరీ విడ్డూరం. సామాజిక మాధ్యమాలలో తరచూ ఏదో ఒక సందర్భంలో ప్రచారాన్ని పొందుతున్న ఈ జంటకి ఇలాంటి విషయాలు తెలియవంటే ఎవ్వరూ నమ్మరు! ప్రభుత్వం వారిపై తీసుకునే చర్యలు మరొకరికి హెచ్చరికగా ఉండాలి!

*కె. దొరబాబు,* **తిరుపతి.**

# హిమాలయ రాజ్యంలో కొత్త శకం!

మనసులో మాట
88

దశాబ్దాలుగా నేపాల్ రాజకీయాల కథ ఒకే పాత పద్ధతిలో సాగుతూ వచ్చింది. డెబ్బై ఏళ్లు పైబడిన పాతతరం నాయకులు, తిరుగుబాటుదారులుగా మారి ప్రభుత్వ యంత్రాంగంలో తిష్టవేసిన మాజీ మావోయిస్టు వృద్ధులు, ఆశ కోల్పోయి నిరాశలో ఉన్న సామాన్య ప్రజానీకం, ఇది ఇప్పటివరకు కొనసాగిన కథ. కానీ 2026 మార్చిలో సాధారణ ఎన్నికల నాటికి, ఈ పాత స్క్రిప్ట్ పూర్తిగా మారిపోయింది. ఎన్నికల ఫలితాలు ఆ పాత స్క్రిప్ట్‌ను పూర్తిగా తుడిచిపెట్టేశాయి. నేపాల్ యువత తమ స్మార్ట్‌ఫోన్ల ద్వారా సాధించిన ఈ విప్లవం, ఆ దేశ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేయడమే కాకుండా, దక్షిణాసియాలో కొత్త సమీకరణాలకు బాటలు వేసింది. ముఖ్యంగా గత ప్రభుత్వాల హయాంలో దెబ్బతిన్న భారత్–నేపాల్ సంబంధాలను పునరుద్ధరించుకోవడానికి ఇది ఒక సువర్ణావకాశం.

ఈ ఎన్నికల్లో బాలేన్‌షా నేతృత్వంలోని రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. గతంలో ఖాట్మండు మేయర్‌గా సంచలనం సృష్టించిన బాలేన్ షా, ఇప్పుడు జాతీయ స్థాయిలో పాత దిగ్గజాలను మట్టికరిపించారు. మాజీ ప్రధానులు కె.పి.శర్మ ఓలీ వంటి వారి అంచనాలను తలకిందులు చేస్తూ, నేపాల్ యువత తమ ఓటు హక్కుతో ఒక నిశ్శబ్ద విప్లవాన్ని ఆవిష్కరించారు. ర్యాప్ సింగర్, స్ట్రక్చరల్ ఇంజనీర్ నేపథ్యం ఉన్న నాయకుడు దేశ పగ్గాలు పట్టడం అనేది కేవలం ఒక వ్యక్తి గెలుపు కాదు, అది ఒక తరం మార్పుకు సంకేతం.

నేపాల్ రాజకీయాల్లో ఈ మార్పు కేవలం ఒక రాత్రిలో రాలేదు. గత ఏడాది ఖాట్మండు, పోఖరా వీధుల్లో వేలాదిమంది యువత నిరసనలకు దిగినప్పుడు, విమర్శకులు దీన్ని ఒక "డిజిటల్ ఫ్యాడ్" (తాత్కాలిక ఉత్సాహం) అని కొట్టిపారేశారు. ఇంటర్నెట్ ఆపేస్తే ఈ ఉత్సాహం చల్లారిపోతుందని భావించారు. కానీ, వారు తప్పుగా అంచనా వేశారు. ఆ నిరసనకారులు ఇళ్లకు వెళ్లలేదు; నేరుగా ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్లారు. ర్యాప్ సింగర్, స్ట్రక్చరల్ ఇంజనీర్ నుండి మేయర్‌గా మారిన బాలేన్ షా నేతృత్వంలో, ఈ ఉద్యమం ఒక బలమైన రాజకీయ శక్తిగా రూపాంతరం చెందింది. అయితే, ఈ "నిరసన శక్తి" నిజమైన పాలనలో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులను తట్టుకోగలదా అన్నది ముఖ్యమైన ప్రశ్న. అవినీతి రహిత పాలన, పారదర్శకత అనే నినాదాలతో ఎన్నికల్లో గెలవడం ఒక ఎత్తు, కానీ సింహ దర్బార్ (నేపాల్ సచివాలయం) హాల్స్‌లో కూర్చుని పాలించడం మరో ఎత్తు. నేపాల్‌ను పాలించడం అనేది కేవలం సోషల్ మీడియాలో వైరల్ అయ్యే అంశం కాదు. మందకొడిగా సాగే బ్యూరోక్రాటిక్ యంత్రాంగాన్ని నడపడం. పాత పార్టీలకు ఉన్నట్లుగా వీరికి వ్యవస్థలో లోతైన నెట్‌వర్క్‌లు లేవు.

నేపాల్‌లో సంభవించిన ఈ రాజకీయ మార్పు భారత్‌కు అత్యంత కీలకమైనది. కొన్నేళ్లుగా నేపాల్‌లోని మాజీ ప్రభుత్వాలు, ముఖ్యంగా కె.పి. శర్మ ఓలీ నేతృత్వంలోని యంత్రాంగం, అనుసరించిన తీవ్ర భారత్ వ్యతిరేక, చైనా అనుకూల ధోరణి ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వంతో తొలి నుండే బలమైన సంబంధాలను ఏర్పరచుకోవడం భారత్‌కు అత్యవసరం.

గత ప్రభుత్వాలు భారతదేశంతో ఉన్న చారిత్రక సంబంధాలను విస్మరించి, చైనా వైపు తీవ్రంగా మొగ్గు చూపాయి. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పేరుతో చైనా తన ప్రభావాన్ని పెంచుతూ నేపాల్‌ను ఒక పావుగా వాడుకుంది.

నేపాల్‌లోని వివిధ కమ్యూనిస్ట్ పార్టీలను, ముఖ్యంగా రెండు ప్రధాన పార్టీలను ఏకం చేసి, తన కనుసన్నల్లో మెలిగే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు చైనా గత కొన్నేళ్లుగా తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అయితే, ఈ ఎన్నికల ఫలితాలు ఖాట్మండులో చైనా ప్రభావానికి గట్టి ఎదురుదెబ్బ. నేపాల్ ఓటర్లు విశ్వసనీయత కోల్పోయిన రాజకీయ వర్గాన్నే కాకుండా, బయటి శక్తులు ఏళ్ల తరబడి చేసిన భౌగోళిక రాజకీయ వ్యూహాలను కూడా తుడిచిపెట్టేశారు. ఇప్పుడు చైనా అనుకూల పార్టీలు నామమాత్రపు స్థానాలకే పరిమితం కావడంతో చైనా వ్యూహం బెడిసికొట్టింది. ఇప్పుడు ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం చైనా వేసే 'రుణ ఉచ్చు'లో పడకుండా చూడటం భారత్ బాధ్యత. ఇందుకోసం ప్రారంభం నుండే నేపాల్‌కు అవసరమైన ఆర్థిక, సాంకేతిక, మౌలిక సదుపాయాల సహాయాన్ని భారత్ అందించాలి.

గతంలో నేపాల్ మాజీ ప్రధాని అయోధ్య, శ్రీరాముని జన్మస్థలం గురించి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కోట్లాదిమంది భారతీయుల మనోభావాలను దెబ్బతీశాయి. ఇరు దేశాల మధ్య ఉన్న లోతైన సాంస్కృతిక బంధంపై ఇది ఒక మచ్చగా మిగిలిపోయింది. కొత్త నాయకత్వం ఇటువంటి అనవసర వివాదాలకు చోటు ఇవ్వకుండా, రెండు దేశాల మధ్య ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవించాల్సిన అవసరం ఉంది.

సరిహద్దు వివాదాల వంటి సున్నితమైన అంశాలను చైనా తన ప్రయోజనాల కోసం వాడుకోకుండా చూడాలంటే, భారత్ నేపాల్ కొత్త ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలి. ఒకవేళ భారత్ ఈ విషయంలో ఆలస్యం చేస్తే, చైనా మళ్లీ తన కుతంత్రాలతో నేపాల్‌ను తనవైపు తిప్పుకునే ప్రమాదం ఉంది. కొత్త పాలనతో మొదటి రోజు నుండే సన్నిహితంగా మెలిగితేనే భారతదేశానికి ప్రయోజనం.

పాత ప్రభుత్వాలు చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ, చైనా ప్రభావానికి లోనవకుండా, భారత్‌తో ఉన్న బంధాన్ని కొత్త నాయకత్వం ఎలా బలోపేతం చేస్తుందో వేచి చూడాలి. నేపాల్ ప్రజల సంక్షేమం కోసం, ఆ దేశ అభివృద్ధి కోసం భారత్ కట్టుబడి ఉందని భారత ప్రధాని తన అభినందన సందేశంలో పేర్కొన్నారు.



నేపాల్ యువ నాయకత్వం.. ఒక విశ్వసనీయ భాగస్వామ్య దేశ ప్రతినిధిగా ప్రధాని మోదీ అందించిన స్నేహహస్తాన్ని అందిపుచ్చుకుంటే నేపాల్‌లో సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుంది.

**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**

# దండాలయ్యా!.. కలెక్టరయ్యా!

## - - ఓ మహిళ హృదయస్పందన - -





***'దండాలయ్యా!..కలెక్టరయ్యా!'..అంటూ ఓ మహిళ జిల్లా కలెక్టర్‌కు కన్నీళ్ళతో తన హృదయస్పందనని తెలుపుకున్నారు. తన ఇంటిని ఆక్రమించుకుని ఇంటి నుండి వెళ్లగొట్టిన వారి గురించి ఆమె కలెక్టర్‌కి చెప్పి కన్నీరు పెట్టుకోవడంతో.. కలెక్టర్ వెంటనే స్పందించారు. ఆమె సమస్య పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఎంతోకాలంగా పోరాడుతున్నా తీరని తన సమస్యను, ఒకే ఒక్క అర్జీతో పరిష్కరించి న్యాయం చేశారంటూ ఆమె కలెక్టర్‌కి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. కలెక్టర్ కంటే దేవుడెవరని ఆమె సంతోషంతో చెప్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజునే ఆమె సమస్యకి పరిష్కారం లభించడం విశేషం. ఇలా బాధితుల సమస్యలను మానవతా హృదయంతో అర్థంచేసుకుంటూ పరిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లను జిల్లా ప్రజలు అభినందిస్తున్నారు కూడా. వివరాల్లోకి వెళితే..***

బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో పేరం విజయకుమారి అనే మహిళ గత కొన్ని నెలలుగా అనేక కష్టాలు పడుతున్నారు. తమ వేదనను ఇటీవలే ఆమె కలెక్టర్‌కి విన్నవించుకుంది. ఆమె తల్లిదండ్రులు తన తమ్ముడి పెళ్లి కోసం లెల్లయ్య అనే వ్యక్తి వద్ద రూ.70వేలు అప్పుగా తీసుకున్నారని, ఆ అప్పు తీర్చకముందే వారు మరణించారని, ఆ తర్వాత 70వేలకు అదనంగా మరో రూ.2,30,000 రూపాయలు కలిపి మొత్తం 3లక్షల రూపాయలు తీసుకున్నట్టుగా బలవంతంగా తన వద్ద పత్రం రాయించుకున్నారని తెలిపింది. ఆ డబ్బుకు మూడు రూపాయలు వడ్డీ చొప్పున నెలకు రూ.9వేలు వడ్డీగా మూడు సంవత్సరాల పాటు కట్టించుకున్నారని, కాల క్రమంలో వడ్డీతో కలిపి మొత్తం రూ.3 లక్షలు చెల్లించినా, ఇంకా రూ.50వేలు ఇవ్వాలని చెప్పి ఇంటి పత్రాలు తిరిగి ఇవ్వకుండా తమ ఇంటిని దౌర్జన్యంగా ఆక్రమించుకుని, తనను, పిల్లలను ఆ ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టేశారని, దీంతో ఇక వేరే దారిలేక బంధువుల ఇళ్లలో తలదాచుకుంటూ జీవనం సాగిస్తున్నానని ఆమె రోదించింది. తనకు న్యాయం చేసి ఆదుకోవాలంటూ కలెక్టర్‌కి అర్జీ ఇచ్చుకుంది. ఆమె బాధను విన్న కలెక్టర్ శుక్లా చలించిపోయారు, వెంటనే స్పందించి, బుచ్చిరెడ్డిపాలెం పురపాలక సంఘ కమిషనర్‌ను ఆ సమస్యపై విచారణ చేయాలని ఆదేశించడం, ఆగమేఘాలపై విచారణ చేపట్టిన అధికారులు ఆమె చెప్పిన విషయాలు వాస్తవమని గ్రహించి, ఆక్రమణలో ఉన్న ఆ ఇంటిని విడిపించి, అసలు యజమాని అయిన విజయకుమారికి ఆ ఇల్లును అప్పగించడంతో ఆమె ఆనందానికి అవధులు లేవు.

### అప్పు ఇచ్చామని వేధిస్తే సహించం - కలెక్టర్

"అప్పుల పేరుతో అమానుషంగా ప్రవర్తిస్తే కఠినచర్యలు తప్పవని ఈ సందర్భంగా వడ్డీ వ్యాపారులను కలెక్టర్ హిమాన్షు శుక్ల హెచ్చరించారు. అధిక వడ్డీలు వసూలు చేయడం, బలవంతంగా పత్రాలపై సంతకాలు తీసుకోవడం, అప్పు ఇచ్చామనే సాకుతో పేద ప్రజలను మానసికంగా, శారీరకంగా వేధించడం, వారి ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకోవడం చట్ట విరుద్ధమని తెలిపారు.

# ములుముడి కలుజుకు..భూమిపూజ!

## 42.50 లక్షలతో నిర్మాణం చేస్తామన్న శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్‌లో ఎప్పటినుంచో ప్రజలు ఆశిస్తున్న ములుముడి కలుజు నిర్మాణానికి ఎమ్మెల్యే కోటంరెడ్డి సంకల్పించి, ఈనెల 8న భూమిపూజ కూడా చేయడంతో స్థానిక ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది. వానలో వరదలో వచ్చినప్పుడు ఇక్కడ వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుండడం అందరికీ తెలిసిందే. ఏళ్ళతరబడిగా ఎవరూ పట్టించుకోని ఈ సమస్యను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పరిష్కరిస్తుండడం హర్షదాయకం. 42.50 లక్షల రూపాయల వ్యయంతో ఇక్కడ వంతెన నిర్మిస్తామని ఆయన తెలిపారు. పొట్టేపాళెం వద్ద కలుజు నిర్మాణపు పనులు వేగంగా జరుగుతున్నాయని, ములుముడి కలుజును కూడా త్వరితగతిన పూర్తిచేయిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం!

## • ప్రస్తుతించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

మారుమూల పల్లెటూరు నుంచి అమెరికాకు వెళ్లి, అక్కడ ప్రఖ్యాత వైద్యునిగా రాణిస్తూ, జన్మభూమిని మరువకుండా తమ పుట్టిన ఊరికి విశేష సేవలందిస్తున్న డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి సేవలు స్ఫూర్తి దాయకమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్) ప్రస్తుతించారు. డాక్టర్ ప్రేమ్ సొంతవూరైన వెంకటాచలం మండలంలోని నిడిగుంటపాళెంలో, డా. ప్రేమ్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ సహకారంతో గ్రామస్తుల కోసం ఏర్పాటుచేసిన ఉచిత కంటివైద్య శిబిరాన్ని ఇటీవల వేమిరెడ్డి సందర్శించారు. ఈ నెల 11న ఈ క్యాంపు ముగిసింది. ఈ శిబిరంలో మొత్తం 616 మందికి కంటి పరీక్షలు చేయగా.. 107 మందికి కాటరాక్ట్ ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, డాక్టర్ ప్రేమ్‌రెడ్డి గొప్పతనాన్ని కొనియాడారు. 1980లో కాలిఫోర్నియాలోని విక్టర్‌విల్లేలో డెజర్ట్ వ్యాలీ మెడికల్ గ్రూప్‌ను స్థాపించి, 2001లో ప్రైమ్ హెల్త్ కేర్ ఏర్పాటు చేశారని, నేడు అమెరికాలోని 15 రాష్ట్రాల్లో 55 ఆసుపత్రులు ఏర్పాటు చేసిన ఘనకీర్తి డా.ప్రేమ్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. తమ వైద్యాలయాల్లో దాదాపు 60వేల మందికి ఉద్యోగ ఉపాధి అవ కాశాలు కల్పించారని వివరించారు. 1989లో డా. ప్రేమ్‌రెడ్డి ఫౌండేషన్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, జన్మనిచ్చిన అమ్మా, నాన్నని, తాము పుట్టిన గ్రామాన్ని ఎన్నటికీ మరిచిపోకూడదనే సందేశం ఇస్తూ ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని అన్నారు. ఎవరూ కంటి చూపు కోల్పోకూడదన్న ఆశయంతో శంకర నేత్రాలయ సహకారంతో కంటి శిబిరం నిర్వహిస్తున్న ప్రేమ్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమంలో భాగస్వామి అయినందుకు సంతోషిస్తూ వారు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని, ఎక్కడ కంటి వైద్య శిబిరాలు జరిగినా.. సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.



ఉచిత కంటివైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

# వంద మందికి..కుట్టు మిషన్లు!

## ➢ పంపిణీ చేసిన కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొడవలూరు మండలం రాజుపాళెంలో నిర్వహించిన మహిళా వేడుకలలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలానికి 20 మంది చొప్పున కోవూరు నియోజకవర్గ పరిధిలోని బుచ్చి, కోవూరు, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట మండలాలకు చెందిన 100 మంది మహిళలకు ఆమె కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. వివిధ రంగాలలో ప్రతిభావంతులైన మహిళలను సన్మానించి ప్రశంసా పత్రాలు అందచేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని అన్నారు. మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా.. తమ కాళ్ల మీద తాము నిలబడినప్పుడే మహిళా దినోత్సవానికి సార్థకత లభిస్తుందన్నారు. ఆత్మస్థైర్యంతో మహిళలు ముందుకు సాగాలన్నారు. జీవితమన్నాక ఒడిదుడుకులు సహజమేనని, ఓటమిని సైతం ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. మహిళలు ఉత్తమ సమాజ నిర్మాతలు కావాలని ఆమె ఆకాంక్షించారు.



# శ్రీసిటీలో..ట్రైనీ ఐఏఎస్ అధికారులు

ఏపీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా 2025 బ్యాచ్‌కి చెందిన 9మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ వారికి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రణాళిక, అభివృద్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్ అధికారులు మాట్లాడుతూ, శ్రీసిటీ రూపకల్పన, అమలు తీరు ఒక అత్యుత్తమ నమూనాగా అభివర్ణించారు. శ్రీసిటీ వాతావరణం, పారిశ్రామిక మౌళిక సదుపాయాలు, పర్యావరణ హిత చర్యలు, కార్పొరేట్ సామాజిక భాధ్యత కార్యక్రమాలు ఎంతో బాగున్నాయంటూ వారు ప్రశంసించారు

# మంత్రి నారాయణ కృషితో.. 4 వందల కుటుంబాల్లో వెలుగులు

రాష్ట్ర పురపాలక మంత్రి డా. పొంగూరు నారాయణ కృషితో ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న స్థానిక ప్రజల సమస్యకు పరిష్కారం లభించింది. సుమారు నాలుగువందల మంది ఇళ్లకు సంబంధించిన విషయంలో మంత్రి చూపిన చొరవ, వారి జీవితాల్లో వెలుగుబాటలు పరచింది. నెల్లూరు నగర నియోజకవర్గం 5వ డివిజన్-సత్యనారాయణపురంలోని 308 సర్వే నంబర్‌లో ఉన్న సుమారు 10 ఎకరాల భూమి, గతంలో భరద్వాజ ఆశ్రమం దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లడం మరియు సబ్ డివిజన్ కాకపోవడంతో 22-ఏ నిషేధిత జాబితాలో చేరి, అక్కడ నివసిస్తున్న 400 కుటుంబాలకు రిజిస్ట్రేషన్లు కాక ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో, రెండు నెలల క్రితం స్థానికుల కష్టాలను స్వయంగా తెలుసుకున్న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ వెంటనే స్పందించి, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్, జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులతో సంప్రదింపులు జరిపి వివాదాస్పద ఆశ్రమ భూమిని మినహాయించి మిగిలిన 9.76 ఎకరాల నివాస భూమిని నిషేధిత జాబితా నుండి తొలగించి, ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయించడంతో పాటు రిజిస్ట్రేషన్లకు ఉన్న అడ్డంకులన్నీ తొలగించారు. తద్వారా 400 కుటుంబాల జీవితాల్లో సంతోషం నింపారు. తమ భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన మంత్రి నారాయణకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

# దివ్యాంగులకు..విపిఆర్ ట్రై-సైకిళ్లు



జిల్లాలోని అభాగ్యులైన దివ్యాంగులకు అవసరమైన విద్యుత్ ట్రై సైకిళ్లను గత కొంతకాలంగా అందజేస్తూ వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్న సేవాభూషణులు.. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల నగరంలోని తమ నివాసంలో మరో అయిదుగురు దివ్యాంగులకు వాటిని అందజేశారు. కొండాపురం మండలం తూర్పు యర్రబల్లి గ్రామానికి చెందిన నలుగురికి, నెల్లూరు రూరల్ పరిధిలో ఒకరికి ట్రై సైకిళ్ళను అందజేశారు. ఆత్మ విశ్వాసానికి వైకల్యం అడ్డుకాదని నిరూపించాలని ఆయన ఈ సందర్భంగా దివ్యాంగులకు సూచించారు.

# రోటరీ సత్కారాలు



నెల్లూరు నగరంలోని వివిధ ప్రభుత్వ సేవా విభాగాల్లో అంకిత భావంతో పనిచేస్తూ ఉత్తమ సేవలందిస్తున్న పలువురు ఉద్యోగులను నెల్లూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 11న నగదు బహుమతులు, శాలువలతో సన్మానించారు. గత డిసెంబరులో పోలియో చుక్కల పంపిణీలో పాల్గొన్న విద్యార్థులకు, ఇతరులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. రోటరీక్లబ్ ప్రెసిడెంట్ టి.ఉదయభాస్కర్‌రావు, కార్యదర్శి రవీంద్రనాథ్, సభ్యులు డి.భరత్‌కుమార్‌రెడ్డి, బి.శ్రీహరిరెడ్డి, అఖిలేష్‌రెడ్డి, కె.ప్రతాప్ కుమార్‌రెడ్డి, కె.బాలసుబ్రహ్మణ్యం, ఎస్.రాఘవేంద్రశెట్టి, కేవీ సుబ్రహ్మణ్యం, నరేష్‌చంద్రారెడ్డి, కె.మధుసూదన్‌రావు, విశ్వేశ్వరరావు, జగన్నాథం, మల్లికార్జున్, రామ్‌ప్రసాద్, దయానంద్, వేలూరు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, కేవీ సుబ్బారెడ్డి,, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్జీఓ హోంలో.. వేడుకలు

నెల్లూరులోని ఎన్జీవో హోంలో జిల్లా ఎన్జీవో సంఘం మరియు ఎన్జీవో సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఇటీవల రెండురోజుల పాటు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన క్రీడోత్సవాలలో విజేతలైన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి సుజాత ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడల విజేతలకు బహుమతులిచ్చారు. జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బందారుపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, సహాధ్యక్షుడు ఆంజనేయవర్మ, లక్కాకుల పెంచలయ్య, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# మహిళా సాధికారతే..ప్రభుత్వ ప్రాధాన్యత!

**మంత్రి నారాయణ**



మహిళలకు బ్యాంకు ఋణాల నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

మహిళల ఆర్థిక సాధికారితకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఆదివారం నెల్లూరు నగరంలోని శ్రీ వేంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, మహిళలకు గౌరవం ఇచ్చే సమాజమే నిజమైన అభివృద్ధిని సాధించగలదన్నారు. ఈ సందర్భంగా మహిళలకు బ్యాంకు రుణాలను అందజేశారు. ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నగర మేయర్ దేవరకొండ సుజాత, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొని మహిళల గొప్పతనాన్ని వివరించారు.

## నా ప్రతి అడుగులోనూ మా అమ్మ ఉంది - కలెక్టర్

ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ "మా అమ్మ సహకారం, భరోసాతోనే తాను ఈరోజు జిల్లా కలెక్టర్ స్థాయికి ఎదిగానన్నారు. 'నా ప్రతి అడుగులోనూ మా అమ్మ ఉందని' గర్వంగా చెప్పుకున్నారు. జిల్లాలో ఎస్పీ దగ్గర నుంచి వ్యవసాయశాఖ జేడీ, డిఆర్‌డిఎ, మెప్మా, ఐసిడిఎస్ పీడీలు, పంచాయతీ అధికారి ఇలా 70శాతం మంది జిల్లాస్థాయి అధికారులు మహిళలే ఉన్నారని, వారు విధులను ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. తొలుత, నెల్లూరు సంగీత కళాశాల విద్యార్థి విశాల్ ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

# మహిళా శక్తే.. దేశానికి శ్రీరామరక్ష



మహిళలను సత్కరిస్తున్న ఫ్రెండ్స్ వాకర్స్ కార్యవర్గం

నెల్లూరు ఏసీ స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా 40 మంది మహిళలను సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షులు నసీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వాకర్స్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు మాట్లాడుతూ, ఒక మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబానికి, తద్వారా సమాజాభ్యున్నతికి ఎంతో ఉపయోగకర మన్నారు. మహిళా శక్తే.. మనదేశానికి శ్రీరామరక్ష అని, నేటి మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటూ దేశాభివృద్ధికి పాటుపడడం హర్షదాయకమన్నారు. జే.వసుంధరాదేవి, పి.జయరాణి, ఎం.భారతి, సుభద్రాదేవి, ఇనుకొండ సోను, హాసిని, అసోసియేషన్ కార్యదర్శి శానంపూడి సుబ్బరాయుడు, పత్తిపాటి రమణయ్య, యు.గోవర్ధన్, బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, అన్నదానం రవిశంకర్, గువ్వల నారాయణరెడ్డి, ఏకొల్లు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సేవోత్సవంగా.. మంత్రి పెళ్లిరోజు

పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, రమాదేవి దంపతుల 42వ పెళ్లిరోజు సందర్భంగా మంగళవారం నెల్లూరులో ఆయన అభిమానులు వారి పెళ్లిరోజును సేవోత్సవంగా జరుపుకున్నారు. వీర మహిళలతో కలిసి గాంధీ బొమ్మసెంటర్‌లో కేక్ కట్ చేసిన జనసేన నేత గుణుకుల కిషోర్ పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బ్రహ్మం గుప్తా, జిల్లా మార్కెటింగ్ కమిటీ మెంబర్ గునుకుల విజయలక్ష్మీ, సూరిశెట్టి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.






**నారాయణ మెడికల్ కాలేజీ వినూత్న కార్యక్రమం**

# నారాయణ 'నేత్రజ్యోతి'



పేదలకు అండగా నిలుస్తూ రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ సరికొత్త చర్యలకు శ్రీకారం చుడుతున్నారు. నెల్లూరులోని నారాయణ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఇటీవల ఆయన 'నారాయణ నేత్రజ్యోతి' అనే కార్యక్రమాన్ని ప్రారంభించి, నేత్రజ్యోతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. 3వ డివిజన్ జాఫర్ సాహెబ్ కాలువకట్ట వద్ద ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. కంటి చూపు మందగించిన నిరుపేదల కోసం ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు, అద్దాలు పంపిణీ చేయడమే కాకుండా, ఆపరేషన్లకు అవసరమైన వారిని నారాయణ సంస్థ వాహనాల్లోనే ఆసుపత్రికి తరలించి, చికిత్స అనంతరం తిరిగి సురక్షితంగా ఇంటికి చేరుస్తామని మంత్రి ప్రకటించారు. రానున్న రోజుల్లో సర్వేపల్లి కాలువకట్ట, పెన్నాకట్ట, గాంధీ గిరిజన కాలనీ, దీన దయాళ్ నగర్ వంటి స్లమ్ ఏరియాల్లో వరుసగా ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ సేవాకార్యక్రమాన్ని పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మునిసిపల్ కమిషనర్ నందన్, కంటివైద్య నిపుణులు డాక్టర్ సుధా, డాక్టర్ వెంకటరమణ, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అజీజ్‌కి మాతృవియోగం



- **ప్రముఖుల సంతాపం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మాతృమూర్తి అన్వర్ జాన్ ఇటీవల మృతి చెందారు. ఆ సమాచారం తెలుసుకున్న రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదివారం నెల్లూరులోని అబ్దుల్ అజీజ్ నివాసానికి చేరుకుని ఆ మాతృమూర్తి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో కూడా ఆయన పాల్గొన్నారు.

అజీజ్ మాతృమూర్తి మరణవార్త విన్నంతనే విద్యామంత్రి లోకేష్ ట్విట్టర్‌లో తన సంతాపం తెలియజేశారు. అజీజ్‌కి ఫోన్‌చేసి పరామర్శించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు రూరల్, సర్వేపల్లి, ఉదయగిరి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, మేయర్ సుజాత తదితరులు తమ సంతాపం తెలిపారు.

## శ్రీ పొట్టి శ్రీరాములు వాకర్స్ క్లబ్..

# కొత్త కమిటీ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

నెల్లూరులోని శ్రీ పొట్టి శ్రీరాములు వాకర్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం ఈనెల 8వ తేదీ స్థానిక టౌన్‌హాల్‌లో జరిగింది. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు నూతన కమిటీ వారిచే ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షులు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, వైస్ ప్రెసిడెంట్ ఎన్. హరినాథ్ రెడ్డి, సెక్రటరీ జి.సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ ఎస్.అభిషేక్, జాయింట్ సెక్రెటరీ అంజాద్ బాషా, వి.కేశవులు, జాలి వాకర్ షేక్ అబ్దుల్‌మజీద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రత్యేక అతిథు లుగా గౌరవ అధ్యక్షులు పప్పు లక్ష్మీనారాయణ, గౌరవ సలహాదారు వై.రవి, డిప్యూటీ గవర్నర్ బొగ్గవరపు శ్రీమన్నారాయణలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని చెత్తనంతా తొలగిస్తున్నాం

**- మంత్రి నారాయణ**



దొంతాలి డంపింగ్‌యార్డ్‌ని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

గత ప్రభుత్వంలో చెత్తపాలనతో ప్రజలపై చెత్త పన్ను వేసి 153 లక్షల టన్నుల చెత్తను రాష్ట్రానికి మిగిలించారని, ఇప్పుడు ఆ చెత్తనంతా తొలగించే కార్యక్రమం తమ కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ విమర్శించారు. నెల్లూరు రూరల్‌లోని దొంతాలిలో ఉన్న డంపింగ్ యార్డును ఆయన ఇటీవల పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం చంద్రబాబు ఆ చెత్తనంతా తొలగించాలని ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. సీఎం ఆదేశాలతో ఇప్పటిదాకా 115 లక్షల టన్నుల చెత్తను తొలగించామని, మిగిలిన చెత్తను జూన్ నాటికి తొలగిస్తామని వివరించారు. దొంతాలిలో 6.73 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందని, వీలైనంత త్వరగా ఆ చెత్తను కూడా తొలగిస్తామని ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో కంపెనీ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను జిందాల్ కంపెనీ ఏర్పాటు చేస్తోందని, నెల్లూరుకు 100 కిలోమీటర్ల పరిధిలోని చెత్త అంతా ఆ ప్లాంటుకు తరలిస్తామని చెప్పారు. రాష్ట్రంలో రోజుకి 7 వేల టన్నుల చెత్త వస్తుందని, అందులో 6500 టన్నులు 'వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల'కు చేరి విద్యుత్‌గా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనవెంట కార్పొరేషన్ కమిషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత అశోక్, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

# మర్యాదపూర్వక కలయిక!



ఇటీవల చెన్నైకి వచ్చిన భారత ప్రధాని నరేంద్రమోడీని, తమిళనాట తెలుగువారి 'తలైవర్' మన నెల్లూరీయులు డాక్టర్ ముద్దుకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. చెన్నై విమానాశ్రయంలో ప్రధానికి డాక్టర్ సి.యం.కే రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 'లింగ్విస్టిక్ మైనారిటీస్' ఛైర్మన్‌గా తమిళనాడు రాష్ట్రంలోని భాషా ఆధారిత మైనారిటీలకి డాక్టర్ సి.యం.కే రెడ్డి అందిస్తున్న సేవలను తెలుసుకున్న ప్రధాని మోడీ ముద్దుకృష్ణారెడ్డిని అభినందించారు.

# శ్రీసిటీలో అనుకూలతలపై..'సోలుం' ఛైర్మెన్ ప్రశంస



శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డితో సుంఘో జున్ బృందం

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పారిశ్రామికవాడ శ్రీసిటీలో నిర్మాణ తుదిదశలో ఉన్న సోలుం ఇండియా హైటెక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ పురోగతి సమీక్షలో భాగంగా సోలుం కంపెనీ లిమిటెడ్ ఛైర్మెన్ మరియు సీఈఓ సుంఘో జున్ మంగళవారం తొలిసారిగా శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ పెట్టుబడిదారుల అనుకూల విధానాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, సమర్థ నిర్వహణను సుంఘో జున్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారం మరియు శ్రీసిటీ అందిస్తున్న సౌకర్యాలను ఆయన అభినందించారు. తొలుత ఆయనకు శ్రీసిటీ బిజినెస్ సెంటర్ వద్ద శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదరస్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతిని వివరించారు.






# సంస్మరణ

అమృతమూర్తి, ఆత్మీయదీప్తి,
మా ఇంటి దైవం, మా అమ్మ

**శ్రీమతి పూండ్ల కామేశ్వరమ్మ గారు**

(W/o లేట్ పూండ్ల చెంచురెడ్డి గారు)

తేది.18.03.2026న ఆమె 6వ వర్ధంతి సందర్భంగా
ఆ ప్రేమమూర్తిని సంస్మరించుకుంటూ...

కుమారులు :
డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి
పూండ్ల వెంకురెడ్డి
మరియు
కుటుంబసభ్యులు

# మానసిక సాంత్వన చేకూర్చే.. 'సౌందర్య లహరి'

## జొన్నవాడ కామాక్షమ్మ సన్నిధిలో.. వేమిరెడ్డి దంపతులు



జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం జొన్నవాడ శ్రీ కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో ఇటీవల నిర్వహించిన 'సౌందర్య లహరి' మరియు 'మూక పంచశతి' పారాయణ కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. అధికసంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మరియు ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో, దాదాపు 500 మంది మహిళలు 'సౌందర్య లహరి'ని అత్యద్భుతంగా పారాయణం చేశారు. ఈ ఆధ్యాత్మిక ఘట్టాన్ని వీక్షించిన వేమిరెడ్డి దంపతులు నిర్వాహకులను ప్రశంసించారు. గురువాయూర్ నుండి జొన్నవాడ వరకు.. నేరెళ్ల పద్మశ్రీ, పద్మావతి బృందం వారు చేస్తున్న ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో భాగంగా వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో ఎంతో ప్రసిద్ధమైన జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పద్మావతమ్మ, పద్మశ్రీ బృందాన్ని వేమిరెడ్డి దంపతులు అభినందించారు. శృంగేరీపీఠం వారి ఆన్‌లైన్ క్లాసుల ద్వారా శిక్షణ పొంది సామాన్య ప్రజలకు 'సౌందర్య లహరి'ని చేరువచేస్తున్న బృందం కృషితో, జనవరిలో గురువాయూర్‌లో మొదటి కార్యక్రమం జరిగిందని, ఇప్పుడు రెండో కార్యక్రమం జొన్నవాడలో నిర్వహించడం సంతోషకరమని వారు కొనియాడారు. జొన్నవాడ ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఆలయ పరిపాలనాధికారి అర్వభూమి శ్రీనివాసులురెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

# 33వ డివిజన్‌లో..14 లక్షలతో రోడ్లు

- పనులను పరిశీలించిన గిరిధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 33వ డివిజన్, నేతాజీ నగర్, 3వ వీధిలో 14 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీ.సీ. రోడ్డు పనులను ఇటీవల కార్పొరేషన్ అధికారులు మరియు కూటమి నాయకులతో కలసి టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సారథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి 33వ డివిజన్ అభివృద్ధికి 3కోట్ల 52 లక్షల రూపాయల నిధులు కేటాయించామన్నారు. నిరంతరం తాము ప్రజలలోనే ఉంటూ, వారి సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్థానిక ప్రజల సూచనలు, అభ్యర్థన మేరకే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, చెప్పిన మాట ప్రకారం ఆ పనులన్నీ 60 రోజుల్లో పూర్తిచేసి, మార్చి 3వ వారంలో కూటమి నాయకుల సమక్షంలో ప్రజలచేతనే వాటికి ప్రారంభోత్సవాలు చేయిస్తామన్నారు. క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు మన్నెం పెంచలనాయుడు, జలదంకి సుధాకర్, కో క్లస్టర్ ఇంచార్జ్ ఎల్.పి. కృష్ణా రెడ్డి, 33వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు కరణం హజరత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# స్వాస్టిక్ సెంటర్‌లో వేడుకలు



సత్కారాన్నందుకుంటున్న మహిళా సిబ్బంది

నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ స్వాస్టిక్ సెంటర్‌లో ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. స్వాస్టిక్స్ సెంటర్ కోఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్ భాస్కర్ తదితరులు మాట్లాడుతూ, నేటి సమాజంలో ముందడుగు వేస్తున్న మహిళల గొప్పతనాలను వివరించారు. అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్పీచ్ థెరపిస్ట్ దేవరాల విజయలక్ష్మిని, స్వాస్టిక్ సెంటర్ మహిళా సిబ్బందిని సన్మానించారు. స్వాస్టిక్స్ సెంటర్ చిన్నారులు వారి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 'పెరసం'.. కొత్త కార్యవర్గం



పెరసం నూతన కార్యవర్గం

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) వారు ఇటీవల కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షులుగా మోపూరు పెంచలనరసింహం, గౌరవాధ్యక్షులుగా డా. గంగిశెట్టి శివకుమార్, గౌరవాధ్యక్షురాలిగా తోట సులోచన, ఉపాధ్యక్షులుగా ఇంద్రగంటి మధుసూదన్‌రావు, షంషుద్దీన్, నాగ గాయత్రి, ఉషారాణి, ప్రధాన కార్యదర్శిగా గోవిందరాజు సుభద్రాదేవి, సాంకేతిక కార్యదర్శిగా దుప్పటి రమేష్‌బాబు, కార్యనిర్వాహక కార్యదర్శిగా హస్తి లక్ష్మణ్‌రాజులను ఎన్నిక చేసుకున్నారు. అదేవిధంగా, సహాయ కార్యదర్శులుగా పార్లపల్లి నాగేశ్వరి, కుని అంకబాబు, ఐనకోట రవికుమార్, యర్రాబత్తిన మునీంద్ర ఎన్నికయ్యారు. కోశాధికారిగా అన్నం శివకృష్ణప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా మాధవ సుధ, ముసునూరు నారాయణ, ప్రసూన శరత్‌లతో పాటు మరో పదిమంది కార్యవర్గసభ్యులను, 20 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

# చేపల గుంటల్లో.. అదే తీరు!

## చికెన్ వ్యర్థాల వాహనాలు పట్టివేత

చికెన్ వ్యర్థాలను తీసుకువచ్చి చేపల గుంటల్లో వేసి మేపుతూ, ఆ చేపలతో ప్రజల ఆరోగ్యం దెబ్బతీస్తున్న చేపలగుంటల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు, అధికారులు చెప్తున్నా జిల్లాకి వీటి రవాణా తగ్గడమే లేదు. ఈనెల 9న అల్లూరు మండలం నార్త్‌మోపూరులో ఉన్న చేపలగుంటల వద్దకు వెళ్తున్న ఓ చికెన్‌వ్యర్థాల లారీని పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదుచేసి లారీని సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, చేపల గుంటల్లో కుళ్ళిపోయిన చికెన్‌వ్యర్థాలను తీసుకువచ్చి వేయడం నేరమని, అందుకు సంబంధించిన చేపల యజమానులపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు.

### పాటూరు వద్ద మరో వాహనం స్వాధీనం :

కోవూరు మండలం పాటూరు పంచాయతీ పల్లిపాళెం వద్ద చేపలగుంటల్లో వేసేందుకు తీసుకుపోతున్న కుళ్ళిపోయిన చికెన్‌వ్యర్థాల వాహనాన్ని కోవూరు పోలీసులు ఈనెల 9న పట్టుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. వాహనంలో గబ్బుకొడుతున్న చికెన్ వ్యర్థాలను పెన్నానది వద్ద పూడ్చిపెట్టారు. వాహనం డ్రైవర్, వాహన యజమానితో పాటు, చేపలగుంతల యజమానిపై కూడా కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు



# నోట్స్ రాయడమంటే..పేజీలు నింపడం కాదు!

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

చదువుకునే సందర్భాల్లో నోట్స్ రాయడం కష్టంగానే ఉంటుంది. వాస్తవానికి నోట్సు రాసుకోవడమన్నది జ్ఞానాన్ని నిలిపే కళ. తరగతిలో వినిపించినది, పుస్తకంలో చదివినది, పరీక్షలో రాయాల్సింది.. ఈ మూడు దారులు ఒకచోట కలవాలంటే నోట్సు రాయడం తప్పనిసరి. చదివినది మన మాటల్లో రాసుకుంటే.. అది మనసులో చెరిగిపోకుండా నిలుస్తుంది. అయితే, నోట్స్ రాయడం అంటే పేజీలు నింపడం కాదు; అర్థాన్ని పట్టుకుని, దాన్ని మన మాటల్లో మార్చి రాయడం. అలా రాసిన నోట్స్ మాత్రమే పరీక్షల సమయంలో మనకు తోడ్పడుతుంది.

చాలామంది విద్యార్థులు నోట్స్ రాస్తున్నా, పరీక్షల సమయంలో అవి ఉపయోగపడకపోవడానికి ప్రధాన కారణం అర్థం చేసుకోకుండా కాపీ చేయడం. 'విన్నది వినకపోతే వృథా, రాసినది చదవకపోతే వృథా'..అని గుర్తుపెట్టుకోవాలి. ఉపాధ్యాయుడు చెప్పినదాన్ని అర్థం చేసుకోకుండా వాక్యాలను యాంత్రికంగా రాయడం వల్ల నోట్స్ కేవలం పుస్తక ప్రతుల్లా మారిపోతాయి. నోట్స్ రాయడం అంటే మెదడు పని చేయడం, ఏదిముఖ్యమో, ఏది అంత ముఖ్యం కాదో, ఏది పరీక్షలో వచ్చే అవకాశం ఉందో గుర్తించి రాసుకోవాలి. అలా రాసిన నోట్స్ మాత్రమే మనసులో నిలుస్తుంది. చదువులో ముందడుగు వేయాలంటే, నోట్స్ రాసుకోవడంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి.

### నోట్స్ రాయడంలోనూ..పద్ధతులున్నాయి :

నోట్స్ రాయడంలోనూ కొన్ని పద్ధతులున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన పద్ధతుల్లో ఒకటి 'కోర్నెల్ నోట్స్' విధానం. పేజీని మూడు భాగాలుగా విభజించి, ఒకవైపు ప్రశ్నలు, మరోవైపు ముఖ్యాంశాలు, చివరలో సారాంశం రాయడం ద్వారా చదువు లోతుగా అర్థమవుతుంది. 'ఆలోచించి రాసినది అర్థమవుతుంది; అర్థమైనది నిలుస్తుంది" అనే మాట ఈ పద్ధతికి సరిగ్గా సరిపోతుంది. ఇదే విధంగా 'మైండ్‌మ్యాప్స్' అనే పద్ధతి ఒక చూపులో మొత్తం అధ్యాయాన్ని చూపించే విజువల్ పద్ధతి. "ఒక చూపు–పది చదువులు" అనే లోకోక్తి మైండ్‌మ్యాప్స్‌కు అచ్చంగా సరిపోతుంది. కేంద్ర భావం చుట్టూ శాఖలుగా విస్తరించే ఈ పద్ధతి మెదడుకు సహజంగా అర్థమయ్యే విధంగా ఉంటుంది. మరో పద్ధతి 'ఫ్లో నోట్స్'..ఉపాధ్యాయుడు చెప్పిన పాఠాల ప్రవాహాన్ని అర్థం చేసుకున్న వెంటనే మన మాటల్లో రాయడం. ఇది కాపీ చేయడం కాదు; ఇది అర్థం వచ్చిన వెంటనే మెదడు ప్రాసెస్‌చేసిన సమాచారాన్ని రాయడం. "విన్నది.. వినగానే రాయాలి" అనే పాతమాట చదువులో ఒక బంగారు నియమంగా చెప్పుకోవచ్చు.

### రాసుకున్న నోట్స్‌ను మరోసారి పరిశీలించుకోవాలి :

నోట్స్ రాయడంలో విద్యార్థులు తరచుగాచేసే పొరపాట్లలో ముఖ్యమైనది పుస్తకాన్ని కాపీ చేయడం. ఇది నోట్స్ కాదు; అది కేవలం వాక్యాల ప్రతులు. అందంగా రాయడంపై ఎక్కువ దృష్టి పెట్టడం కూడా మరో పొరపాటు. నోట్స్ అందంగా ఉండటం మంచిదే కానీ, అర్థం స్పష్టంగా ఉండటం మరింత ముఖ్యం. పునర్విమర్శ చేయకపోవడం నోట్స్‌ను నిరుపయోగంగా మార్చేస్తుంది. 'చేసిన పని చూసుకోకపోతే చెల్లదు' అన్నట్లే, రాసిన నోట్స్‌ను తిరిగి చూడకపోతే అవి మనకు ఉపయోగపడవు. నోట్స్ రాయడం మొదటి అడుగు మాత్రమే; నిజమైన జ్ఞానం పునర్విమర్శలో ఉంటుంది. చదువులో నోట్స్ రాయడం ఎంత ముఖ్యమో, వాటిని మనసులో నిలిపే విధంగా ఉపయోగించడం కూడా అంతే ముఖ్యం. ప్రతి అధ్యాయం పూర్తయ్యాక రెండు నిమిషాలు సమయం తీసుకుని 'ఈ పాఠం నాకు ఏమి నేర్పింది?' అని మనసులో ప్రశ్నించుకోవాలి. అలాంటి చిన్న ఆత్మపరిశీలన నోట్స్‌ను మరింత బలంగా మార్చుతుంది. "తనకు తానే గురువు అయితే విద్య ఎప్పుడూ వృథా కాదు" అనే లోకోక్తి చదువులో అక్షరాలా నిజం. మనమే మన చదువుకు బాధ్యత తీసుకున్నప్పుడు నోట్స్ శక్తి రెట్టింపు అవుతుంది. నోట్స్ రాసిన వెంటనే వాటిని ఒకసారి మనసులో చదువుకోవడం, ఆ తర్వాత గట్టిగా చదవడం మెదడులో రెండు వేర్వేరు మార్గాలను ఉత్తేజపరుస్తుంది. "చెవితో విన్నది చెరిగినా, నోటితో చెప్పినది నిలుస్తుంది" అనేమాట చదువులో శాస్త్రీయంగా కూడా నిజమే.

### జ్ఞాపకశక్తికి ప్రధానం..నోట్సు పునర్విమర్శే :

నోట్స్ పునర్విమర్శ జ్ఞాపకశక్తికి అసలు తాళం చెవిగా అర్థంచేసుకోవాలి. మొదటి రోజు రాసిన నోట్స్‌ను ఇరవై నాలుగు గంటల్లో ఒకసారి చూడడం, ఆ తర్వాత ఒక వారంలోపల మరోసారి చూడడం, పరీక్షకు ముందు సారాంశం మాత్రమే చూడడం– ఈ మూడు దశలు చదివినది మెదడులో బలంగానిలిపేస్తాయి. 'మూడుసార్లు చూసినది మూడేళ్లునిలుస్తుంది'అనేమాటశాస్త్రీయంగాకూడానిజమే. పునర్విమర్శ లేకుండా నోట్సు రాయడమంటే, విత్తనం వేసి నీళ్లు పోయకపోవడం లాంటిది. నోట్స్ మీకు పనిచేయాలి, మీరు వాటికి కాదు. నోట్స్ రాయడం భారంగా అనిపిస్తే పద్ధతి మార్చుకోవాలి. నోట్స్ చదువును సులభం చేయాలి, వేగవంతం చేయాలి, స్పష్టత ఇవ్వాలి. "సరైన పద్ధతి ఉంటే పని సగం పూర్తయినట్టే' అనుకోండి. నోట్స్ విషయంలో ఇది అక్షరాలా నిజం. అందులోనూ, మీ నోట్స్ మీ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించాలి. స్పష్టంగా, సంక్షిప్తంగా, అర్థవంతంగా, పరీక్షలో ఉపయోగపడేలా ఉండాలి. చదువు జీవితాంతం కొనసాగుతుంది, కానీ నోట్స్ రాయడం అలవాటైతే ఏ రంగంలో ఉన్నా ముందుంటారు. "అలవాటు మనిషిని ఆకాశానికి తీసుకెళ్తుంది" అని పెద్దలు చెప్పిన మాట చదువులో మరింత నిజం. నోట్స్ రాయడం ఒక అలవాటు, ఆ అలవాటు ఒక శక్తి. ఆ శక్తిని అలవరుచుకున్న విద్యార్థి ఎప్పుడూ ముందుంటాడు. చదివినది మరిచిపోకుండా ఉంచే రహస్యం నోట్స్‌లోనే ఉంది. నోట్స్‌ను సరిగ్గా రాయడం, సరిగ్గా పునర్విమర్శ చేయడం, సరిగ్గా ఉపయోగించడం–ఇవి మూడూ కలిసి చదువును శక్తివంతం చేస్తాయి.. అని విద్యార్థులంతా గుమనించుకోవాలి.



**వచ్చే వారం:** విద్యార్థిగా ఆత్మవిశ్వాసం ఎలా పెంచుకోవాలి?

E-mail: reddyu@gmail.com

### శ్రీకాళహస్తీశ్వరాలయం

## ఇఓగా.. బీకే వెంకటేశులు



రాష్ట్రంలోని సుప్రసిద్ధమైన శైవ క్షేత్రం.. శ్రీకాళహస్తీశ్వరాలయం నూతన కార్యనిర్వహణాధికారిగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటి కలెక్టర్ బీకే వెంకటేశులు నియమితులయ్యారు. ఇటీవల ఆయన శ్రీకాళహస్వీశ్వర స్వామిని దర్శించుకుని, గురు దక్షిణా మూర్తి సన్నిధిలో పూజలు చేసి, బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయనను వేదపండితులు ఆశీర్వదించారు. తొలుత ఆయన ఆలయం వద్దకు రాగానే ఆలయ అర్చకులు, సిబ్బంది సాదర స్వాగతం పలికారు. ఆలయ ఇఓగా ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని, దైవదర్శనం కోసం వచ్చే స్వామివారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్ కొట్టె సాయిప్రసాద్, బోర్డు సభ్యులు నాగరాజు, రాఘవయ్య, డీఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ప్రోటోకాల్ ఏఇఇఓ మోహన్, ఏఇఓలు హేమమాలిని, లోకేష్‌బాబు, పర్యవేక్షకులు నాగభూషణం, రవి, ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, అర్చకులు అర్ధగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లిపాడు 'డైట్'లో.. సంబరాలు

ఇందుకూరుపేట మండలం, పల్లిపాడులోని ప్రభుత్వ డైట్ విద్యాసంస్థలో ప్రపంచ మహిళా దినోత్సావాన్ని పురస్కరించుకుని ఇటీవల ఉత్సహంగా సంబరాలు జరిగాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.అక్కిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో 'డైట్'లో ప్రథమ సంవత్సరం చదువుతున్న ఛాత్రోపాధ్యాయులు పాటలు, నృత్యాలు, ఉపన్యాసాలతో అందరినీ అలరించారు. మరికొంతమంది అధ్యాపకులు కవితలు చదివి వినిపించారు. సీనియర్ ఉపన్యాసకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో మహిళలు ఎంతో కీలకం

### - నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



మహిళా నాయకురాళ్ళని సత్కరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, అన్ని రంగాల్లో మహిళలు ముందుంటూ సమాజ సంక్షేమానికి మరింతగా కృషిచేయాలని వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇటీవల వెంకటగిరిలో నేదురుమల్లి నివాసమైన ఎన్‌జేఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మహిళలు దేశాభ్యున్నతికి కృషిచేయాలన్నారు. వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ పరిశీలకురాలు కోడూరు కల్పలత, మున్సిపల్ మహిళా కౌన్సిలర్లు, మహిళా ఎంపీటీసీలు, వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు రామతులసిలను ఈ సందర్భంగా సన్మానించి అభినందించారు కేకు కట్‌చేసి, మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## ఎన్‌బికేఆర్‌లో.. మహిళా దినోత్సవం




మహిళా దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు, ఎన్‌సిసి క్యాడెట్లు, అధ్యాపక బృందం

నేడు దేశంలోని అనేకరంగాల్లో మహిళలు తమ ప్రతిభాపాటవాలతో ముందంజలో ఉన్నారని, మహిళాశక్తి ఎంతో గొప్పదని ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టీ డైరెక్టర్ డా.వి. విజయకుమార్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇటీవల కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కుటుంబం నుండి దేశ నిర్మాణం వరకు ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను నిరూపిస్తున్నారని తెలిపారు. మహిళల పట్ల ప్రతిఒక్కరికీ గౌరవభావం ఉండాలని ఆయన విద్యార్థులకు సందేశం ఇచ్చారు. పతి విద్యార్థి తన తల్లి గొప్పతనాన్ని, ఆమె చేసిన త్యాగాలను ఈ సందర్భంగా వక్తలు విద్యార్థులకు తెలియజేసిలో వారిలో స్ఫూర్తిని నింపారు. నావల్ ఎన్‌సీసీ అధికారి సబ్ లెఫ్టినెంట్ డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడల పోటీలు జరిగాయి. విద్యార్థుల కోసం డ్రాయింగ్ పోటీలు, మహిళల కోసం మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు మహిళా సాధికారతపై ప్రసంగాలు చేశారు. విజేతలకి ముఖ్యఅతిథి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

# గూడూరు డివిజన్

### డా. రోహిణి ఆధ్వర్యంలో రూ.70 లక్షలతో నిర్మించిన

## ఆంధ్ర మహిళా మండలి నూతన భవనం ప్రారంభం



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్ - సంధ్యారాణి దంపతులు

ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన డాక్టర్ సి.రోహిణి సారధ్యంలో ఆంధ్ర మహిళా మండలి రాబోయే రోజుల్లో మరెన్నో సహాయ కార్యక్రమాలు నిర్వహించాలని, మహిళా మండలికి తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలియజేశారు. పట్టణంలోని తమ్మిశెట్టి గుంట వద్ద మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి దాతృత్వంతో మండలి సభ్యుల సహకారంతో 70లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ఆంధ్ర మహిళా మండలి భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీల్‌కుమార్, ఆయన సతీమణి సంధ్యారాణిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే సునీల్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలో సి.ఆర్.రెడ్డి కుటుంబం అంటే ఎంతో గుర్తింపు ఉందని, నూతన భవనం చాలా బాగా ఉందని, కొన్ని సమస్యలు తెలియజేశారని త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని వెల్లడించారు. మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, డా. సి.జనార్ధన్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మాధురి, విష్ణువందన, లక్ష్మి, మహిళా మండలి, రోటరీ క్లబ్ సభ్యులు, బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఇన్‌ఛార్జి ఆర్డీవోగా సత్యనారాయణ

గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గూడూరు ఇన్‌ఛార్జి ఆర్డీవోగా జి.వి.వి.సత్యనారాయణ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. రామాయపట్నం ఇండస్ట్రియల్ క్లస్టర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ఇన్‌ఛార్జి ఆర్డీవోగా నియమించారు.

### తల్లిదండ్రులూ!..

## యువతని గమనించండి

### ఇన్‌చార్జ్ డీఎస్పీ గిరిధర్



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌ఛార్జి డీఎస్పీ గిరిధర్

యువత మత్తుపదార్థాలకి బానిసలు కాకుండా తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని గూడూరు ఇన్‌ఛార్జి డీఎస్పీ గిరిధర్ పేర్కొన్నారు. గూడూరు రెండవ పట్టణ సమీపంలోని టిడ్కో అపార్ట్‌మెంట్ గృహాల వద్ద ఇన్‌ఛార్జి డీఎస్పీ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా సహించేది లేదని హెచ్చరించారు. నివాస ప్రాంతాల నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ముందుగా సమాచారం అందిస్తే.. దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని అక్కడి నివాసితులకు తెలియజేశారు. అనంతరం వారి వద్ద ప్రతిజ్ఞ చేయించారు. సీఐలు శేఖర్‌బాబు, వెంకటేశ్వర్లు, ఎస్సైలు మనోజ్‌కుమార్, తిరుపతయ్య సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలకి జేవీవీ భోజనాలు



గర్భిణీ స్త్రీలకి భోజనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఇటీవల జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నందిమండలం హరికృష్ణ జ్ఞాపకార్ధం బాల కృష్ణరాజు దాతృత్వంలో నిరుపేద గర్భిణీ స్త్రీలకి భోజనాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ చేతులమీదుగా ఈ కార్యక్రమం జరిగింది.

## మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు

### 7వ అదనపు జిల్లా జడ్జి నాగ పవన్



కేక్ కట్ చేస్తున్న 7వ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్

మహిళల రక్షణ కోసం భారత రాజ్యాంగంలో అనేక చట్టాలు రూపొందించబడ్డాయని 7వ అదనపు జిల్లా జడ్జి కె.వెంకట నాగపవన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల గూడూరు రెండవ పట్టణంలోని కోర్టు కాంప్లెక్స్ భవనంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సనాతన సంస్కృతిలో స్త్రీలు ప్రముఖ పాత్ర వహించారని, పరాయి స్త్రీలో తల్లిని చూడాలని మన ధర్మం చెప్తుందని తెలియజేశారు. అనంతరం కేక్‌ను కట్ చేసి మహిళా సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఏవో జి.ప్రసన్నలక్ష్మి, సీనియర్ అడ్వకేట్లు అరవ పార్వతయ్య, ఎ.కోటేశ్వరరావు, షేక్ మహబూబ్ బాషా, రాజగోపాల్, చరిష్మా, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


## నైతిక విలువలను పెంపొందించుకోవాలి

### డాక్టర్ కోటా సునీల్‌కుమార్




ప్రతిఒక్క విద్యార్థి విద్యతో పాటు నైతిక విలువలు పెంపొందించుకొని సంస్కారవంతులుగా ఉండాలని రోటరాక్ట్ డి.ఆర్.ఆర్ తేజ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యు కళాశాలలో రోటరాక్ట్ వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు విద్యార్థినిలు పాటించవలసిన నైతిక విలువల గురించి క్లబ్ డిఆర్ఆర్ తేజ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కోటా సునీల్‌కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, క్లబ్ అధ్యక్షురాలు సుధా తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ వైభవం...!




రాధా మాధవ్ సినిమాహాళ్ళ యజమాని కీ॥శే॥ డేగ రామ్‌గోపాల్‌రెడ్డి - శ్రీమతి దొరసానమ్మల మనుమరాలు,
నెల్లూరు వాస్తవ్యులు, చెన్నై నివాసి డేగ శ్రీనివాసులురెడ్డి - డా. సునీతల కుమార్తె
డా. శ్రీదివ్య - డా. రితేష్‌ల పరిణయం మార్చి 4వ తేదీ చెన్నైలో వైభవంగా జరిగింది.
నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.

## నాయకులే కాదు.. నావికులు కూడా!


బోటు నడుపుతున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

తాము నాయకులమే కాదు.. నావికులం కూడా అని నిరూపించుకుంటూ మన ఎమ్మెల్యేలు అందరి దృష్టిని ఆకర్షించారు. ఇటీవల జువ్వలదిన్నెలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బోటుషికారు చేసిన సందర్భంలో, సర్వేపల్లి, కావలి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, డీవీ కృష్ణారెడ్డిలు ఏమాత్రం జంకు లేకుండా బోటును నడపడంతో అందరూ ఆశ్చర్యపోయారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరు మండలం కృష్ణపట్నం వాసులకు మంజూరైన రూ.1.20 కోట్ల విలువైన ఆ డీప్ సీ ఫిషింగ్ బోటును లబ్దిదారులైన ఆవుల వరలక్ష్మి–బాబు దంపతులకు అప్పగించారు. ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కొండూరు పోలిశెట్టి, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ శాంతి తదితరులంతా బోటులో ఎక్కారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడంలో భాగంగా ప్రభుత్వాలు మంచి ప్రోత్సాహకాలు అందిస్తున్నాయన్నారు. పీ.ఎం.ఎం.ఎస్.వై పథకం కింద ఈ బోటు కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.48 లక్షలు సబ్సిడీ ఇచ్చాయన్నారు. 15 నుంచి 20రోజుల పాటు సముద్రంలోనే ఉండి చేపల వేట సాగించడంతో పాటు ఆ చేపలను నిల్వచేసుకునే సదుపాయం కూడా ఈ బోటులోనే ఉందని తెలిపారు. జీపీఎస్, వైర్‌లెస్ కమ్యూనికేషన్, ఆధునిక వేట పరికరాలు వగైరాలన్నీ ఈ బోటులోనే ఉండడం దీని ప్రత్యేకత అని వివరించారు.

## వైసీపీ ఆవిర్భావ దినోత్సవం


వ్యవస్థాపక దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

వైసీపీ 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 12న నెల్లూరులో వైసీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. నగరంలోని రాంజీనగర్ కార్యాలయంలో వైసీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి.. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. నగర నియోజకవర్గ పరిశీలకులు కొండ్రెడ్డి రంగారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలతో కలిసి దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, 16 కేజీల భారీ కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచారు. అనంతరం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రానికి మంచి జరగాలంటే మళ్ళీ జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఈదూరు కోదండరామునికి.. 19 నుంచి వసంత నవరాత్రోత్సవాలు



తోటపల్లిగూడూరు మండలం ఈదూరు గ్రామంలోని శ్రీ హనుమత్ లక్ష్మణ సీత సమేత శ్రీ కోదండరామస్వామివారి దేవస్థానంలో మార్చి 19 నుంచి 29వతేదీ వరకు శ్రీవారి వార్షిక వసంత నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. 19న స్వామివార్లకు ఉగాది లక్ష తులసి అర్చన, 24న శ్రీ అభయాంజనేయస్వామి వారికి ఉభయకర్తలు రావి మోహన్‌చౌదరి–దుర్గాభవానిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 26వ తేదీ రాత్రి హనుమంత వాహనసేవ, 27న శ్రీరామనవమి సందర్భంగా స్వామివార్లకి కల్యాణోత్సవం, గరుడసేవ నిర్వహిస్తారు. 28వ తేదీ ఉదయం పట్టాభిషేకం, గజవాహనసేవ, 29న గంధవడి ఉత్సవం తర్వాత అదేరోజు రాత్రికి ఏకాంతసేవ నిర్వహిస్తామని ఆలయ ఛైర్మెన్ రావి మోహన్‌చౌదరి తెలిపారు. ఏప్రిల్ 11న స్వామివార్లకు 16 రోజుల పండుగ వైభవంగా చేయనున్నామని వివరించారు.

### పదవిలోఉన్నా, లేకున్నా..

# ప్రజల కోసం పనిచేసే నాయకుడు సోమిరెడ్డి

- ప్రశంసించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి


ముత్తుకూరులో విద్యార్థినులకు సైకిళ్ళను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కోటంరెడ్డి

పదవిలోఉన్నా, లేకున్నా..ప్రజల కోసం పనిచేసే నాయకుడు సోమిరెడ్డి అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రశంసించారు. ఇటీవల ముత్తుకూరులో విద్యార్థినులకు సైకిళ్ళు పంపిణీ చేసిన కార్యక్రమంలో సోమిరెడ్డితో పాటు కోటంరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయాల్లో ఆస్తులమ్ముకున్న కుటుంబం సోమిరెడ్డిదని, వారి కుటుంబం ఆ ఆస్తులు అమ్మకుండా ఉంటే ఈరోజు వాటి విలువ రూ.300కోట్ల వరకు ఉంటుందని అన్నారు. తానెక్కడ ఉన్నా ప్రజల కష్టాలు తీర్చేందుకు సోమిరెడ్డి ప్రయత్నిస్తూనే ఉంటారని, ముఖ్యంగా రైతులు సమస్యల్లో ఉంటే జిల్లాలో వినిపించే తొలి గొంతు ఆయనదేనని అన్నారు. సోమిరెడ్డి శాసనసభ్యులుగా ఉండటం సర్వేపల్లి నియోజకవర్గానికే గర్వ కారణమన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలపై యువనేత నారా లోకేష్‌బాబు వీరోచితంగా పోరాడారని కోటంరెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ప్రజల్లో భరోసా కల్పించేలా వేలాది కిలో మీటర్లు చేసిన యువగళం పాదయాత్ర జననీరాజనాల మధ్య అద్భుతంగా సాగిందన్నారు. అనంతరం సోమిరెడ్డితో కలసి 346 మంది విద్యార్థినులకు సైకిళ్ళు అందజేశారు. సోమిరెడ్డి మాట్లాడుతూ, ఎస్ఇఐఎల్ కంపెనీ 1841 హీరో సైకిళ్ళను ఆ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో అందించిందంటూ వారికి ధన్యవాదాలు తెలిపారు. లోకేష్‌బాబు యువగళం పాదయాత్ర చేసిన 3132 కిలోమీటర్లకు గుర్తుగా 3132 సైకిళ్లను విద్యార్థులకు కానుకగా ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, మరో 1300 సైకిళ్లను కూడా సమకూర్చుకుని విద్యార్థులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

## ప్రగతి పనుల ప్రారంభకులు..ప్రజలే!

**240 అభివృద్ధి పనులకు..**
**22న ప్రారంభోత్సవం**


నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

ప్రగతి పనుల ప్రారంభకులు ప్రజలేనని, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మార్చి 22వ తేదీన 27 కోట్ల రూపాయల వ్యయంతో ఏకంగా 240 అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని, వాటికి ప్రారంభకులు నియోజకవర్గ ప్రజలేనని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుడు.. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరధర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 11న నెల్లూరులోని తమ కార్యాలయంలో ఆ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంపై కూటమి నాయకులు, కార్యకర్తలతో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సన్నాహక సమావేశాన్ని ఏర్పాటుచేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని ఒక ఆదర్శవంతమైన నియోజకవర్గంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీర్చితిద్దుతున్నారని ఆయన చెప్పారు. బీజేపీ నాయకులు మండ్ల ఈశ్వరయ్య. కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కిడ్నీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### అపోలో స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుల సూచన




కిడ్నీ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు సూచించారు. మార్చి 12న ప్రపంచ కిడ్నీ దినం' సందర్భంగా 'అందరికీ కిడ్నీ ఆరోగ్యం–ప్రజల సంరక్షణ, భూమి రక్షణ' అనే థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమంలో అపోలో వైద్యులు.. ప్రముఖ కిడ్నీవ్యాధి నిరోధక నిపుణులు పాల్గొని ఆ వ్యాధుల పట్ల అవగాహన కలిగించారు. కిడ్నీ వ్యాధులను అవగాహనతో, తొందరగా గుర్తించడం యొక్క ప్రాముఖ్యతను వారు తెలియజేశారు. అనంతరం, అపోలో స్పెషాలిటీ హాస్పిటల్లో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ప్రముఖ కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ, కిడ్నీ వ్యాధులను ప్రారంభదశలోనే గుర్తించి తగు చికిత్సలు చేసుకోవడం మంచిదన్నారు. అపోలో డాక్టర్లు మస్తాన్‌వలీ, రాకేష్ హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ డాక్టర్ బిందుభార్గవిరెడ్డి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ప్రతి పదిమందిలో ఒకరికి తీవ్రమైన కిడ్నీ వ్యాధి ఉండే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, దయాబెటిస్ మరియు రక్తపోటు నియంత్రణ వగైరాలు కిడ్నీ వ్యాధి నివారణకు చాలా ముఖ్యమైనవని తెలిపారు. అందరికీ సమానంగా కిడ్నీ చికిత్స అందుబాటులో ఉండడం, పర్యావరణానికి అనుకూలమైన వైద్య విధానాల అవసరాన్ని కూడా అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలు తమ కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవగాహన పెంచుకుని, వైద్యుల సలహాలు సంప్రదింపులతో ఆ వ్యాధులను నివారించుకునే విధంగా చూసుకోవాలని వారు వివరించారు.



మహిళ సమస్యను వింటున్న రాయపాటి శైలజ

# మహిళలను వేధిస్తే కఠినచర్యలు!

## రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

మహిళలను వేధింపులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ హెచ్చరించారు. ఈనెల 9న నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళా జన సున్వాయి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు తమ సమస్యలను మహిళా కమిషన్ ఎదుట విన్నవించి అర్జీలు సమర్పించారు. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేలా ఆమె పంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, జాతీయ మహిళా కమిషన్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా జన సున్వాయి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొదటిసారిగా నెల్లూరులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి మహిళల సమస్యలను నేరుగా తెలుసుకున్నామని చెప్పారు. ఎక్కువగా గృహహింస, వెట్టిచాకిరి, వృద్ధులను వేధించడం మొదలైన ఫిర్యాదులు వచ్చాయని, మహిళల సమస్యలు తీర్చి, వారి రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# భారతీయ జీవన విధానమే.. 'పంచ పరివర్తన'

## ఏబీఆర్ఎస్ఎం సభలో వక్తలు



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహా సంఘ్(ఏబిఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో 'పంచ పరివర్తన' అనే అంశంపై ఇటీవల తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విద్యార్థినీవిద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.పద్మావతి మాట్లాడుతూ, నేటి ఆధునిక సమాజంలో విద్యతో మంచి సంస్కారం, ఆలోచనలు, నడవడిక ఎంతో ముఖ్యమన్నారు. ఎస్వీ యూనివర్సిటీ విశ్రాంత తెలుగు ఆచార్యులు ప్రొఫెసర్ గార్లపాటి దామోదర్‌నాయుడు మాట్లాడుతూ, ఏ దేశ భవిష్యత్తు అయినా ఆ దేశంలోని విద్యార్థుల ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటుందన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కుటుంబ సౌభ్రాతృత్వం, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ వస్తువుల వినియోగం, సామాజిక సమరసత మరియు పౌరవిధులు–ప్రభుత్వ చట్టాల పాటింపు మొదలైన పంచ పరివర్తనాలపై ప్రతి విద్యార్థి అవగాహన కల్పించుకొని సమాజంలో బాధ్యతగల ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం, వ్యాస రచన పోటీలో ప్రథమ స్థానం సాధించిన పి.వైష్ణవికి రూ.2500, ద్వితీయ స్థానం సాధించిన వి .బద్రీనాథ్‌కి రూ.1500 మూడవ స్థానాన్ని సాధించిన పి.ప్రవల్లికకు రూ.1000, నాలుగు మరియు అయిదు స్థానాలు సాధించిన ఎం.సుధాశ్రీ మరియు షేక్ జబీనాలకు రూ .500 రూపాయల వంతున నగదు బహుమతులిచ్చారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఏ .పద్మజ, ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, రాష్ట్ర కోశాధికారి ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రొఫెసర్ రంజని, ఇంజనీరింగ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బాలసుబ్రమణ్యం, డాక్టర్ వివేక్, వీరనారాయణరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...

### కావలిలో కార్మికులకు.. స్వచ్ఛ నారీశక్తి పురస్కారాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల కావలి పురపాలక సంఘం పారిశుద్ధ్య విభాగంలో విశిష్ట సేవలందిస్తున్న పలువురు మహిళా కార్మికులకు స్వచ్ఛ నారీశక్తి పురస్కారాలన అందజేశారు. మునిసిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పురపాలక, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

### లేగుంటపాడు అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కోవూరు మండలం లేగుంటపాడులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఈనెల ఈనెల 10న సీడీపీఓ శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ పారదర్శకంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల పాల్గొన్నారు.

### కొండాపురంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి

మండల కేంద్రమైన కొండాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వతరగతి చదువుతున్న విద్యార్థులకు లైఫ్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ నవీన్ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి బాగా చదువుకుని, ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

### కోటలో బీసీ హాస్టల్ విద్యార్థుల ప్రతిభ

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఇటీవల మండల కేంద్రమైన కోటలోని బీసీ బాలుర వసతిగృహం విద్యార్థులు నైపుణ్యంతో రూపొందించిన పలు ప్రాజెక్టుల నమూనాలకు ప్రతిభా పురస్కారాలు లభించాయి. హాస్టల్ వార్డెన్ గజేంద్ర బాబు ఈనెల 9న హాస్టల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థులను అభినందించారు.

### రాపూరులో మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల రాపూరు ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జి.శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొని సమాజ నిర్మాణంలో మహిళలు కీలకపాత్రను పోషిస్తున్నారని తెలిపారు.

### ముత్తుకూరులో సీఐటీయు ధర్నా

ముత్తుకూరు మండలంలోని మామిడిపూడికి రోడ్డు వేయాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 9న సీఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గుంటల మయంగా ఉన్న ఈ రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఎం నాయకులు అంకయ్య, ఆటో కార్మికులు తదితరులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

# అపూర్వ 'త్యాగధనుడు'.. శ్రీ పొట్టి శ్రీరాములు



కీర్తిమూర్తులు

సొంత రాష్ట్రం లేనందున, పాలనాపరమైన సౌలభ్యం లేకపోయినందువల్ల ఆంధ్రులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని పొట్టి శ్రీరాములు కలత చెందారు. సొంత రాష్ట్రం లేకుండా నిర్మాణాత్మక అభివృద్ధి జరుగదని తీర్మానించుకొన్నారు. ఈ ఆలోచనే శ్రీరాములును ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనకై తనవంతు త్యాగాన్ని చేయాలని దృఢ సంకల్పానికి పునాది వేసింది.

"పట్టు పట్టరాదు, పట్టిన విడువరాదు, పట్టనేని బిగియ పట్టవలయు, పట్టి విడుచుట కంటె పడిచచ్చుట మేలు" అని వేమన అన్న మాటల్ని అక్షరాలా నిజం చేసిన వాడు శ్రీ పొట్టి శ్రీరాములు. ఆంధ్ర రాష్ట్ర సాధనలో ఆయన పట్టు విడవని, చెక్కుచెదరని ఈ వ్యక్తిత్వం అజరామరమై నిలిచింది.

అంతేకాదు, "ఆదర్శాలు నిజానికి ఆత్మశక్తి సంకేతాలు. అలాగే వ్యక్తిత్వం కూడా అనంత శక్తి కేంద్రం. ఈ రెండూ కలిసిన మనిషి చరిత్రను సృష్టిస్తాడు" అన్న హెన్రీజేమ్స్ మాటలకు శ్రీరాములు సాక్షాత్తూ నిలువెత్తు స్వరూపం.

ఉన్నతమైన ఆదర్శాలు, త్యాగ తపోధనం, సమిష్టి ప్రయోజనాకాంక్ష కలిగిన వ్యక్తిత్వం ఆయనకు సహజంగా అబ్బినవే. అందువలననే ఆంధ్ర రాష్ట్ర సాధనను సుసాధ్యం చేశారు. ఇందుకోసం జీవితాన్ని త్యాగం చేసిన త్యాగధనుడు, ధన్యజీవి అనిపించుకొన్నారు.

### స్వామి సీతారాం ప్రయత్నం :

ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కావాలని కోరుతూ స్వామి సీతారాం రెండుసార్లు మొత్తం 55 రోజులు నిరాహార దీక్ష చేశారు. చివరకు వినోబాభావే విజ్ఞప్తిని పురస్కరించుకొని దీక్ష విరమించారు. కానీ, నెహ్రూ నిర్లక్ష్య ధోరణి వల్ల వినోబాభావే వాగ్దానం భంగమైంది. నెహ్రూ నిరాహారదీక్ష ద్వారా సమస్యలు పరిష్కృతం అవుతాయని నమ్మేవారు కాదు. కేవలం చర్చల ద్వారానే సమస్య పరిష్కారం అవుతుందని ఆయన ప్రగాఢ విశ్వాసం. నెహ్రూ ఈ నిరాహారదీక్ష పద్ధతిని నిరసించాడు. అందుకే సీతారాం రెండవ దీక్షను కూడా విరమించాల్సి వచ్చింది.

కానీ, శ్రీరాములు అలా కానేకాదు. పట్టుదల, పంతం నెరవేరేదాకా ఆంధ్రుల హృదయాగ్ని చల్లారేదాకా విశ్రమించనని తీర్మానించుకొన్నాడు. నిర్భయత్వం, సర్వమానవ సమానత్వం లాంటి కార్యక్రమాలతో ఆయనో సంఘజీవిగా మారాడు. తన కోసం ఏమీ కోరని అపూర్వ వ్యక్తిత్వం అలవరచుకొన్న మహిమాన్విత చరితుడు శ్రీ పొట్టి శ్రీరాములు.

నెల్లూరులో అస్పృశ్యతా నివారణ పేర ఆయన చేసిన ఉద్యమం ఆ రోజుల్లో పెద్ద సంచలనాన్ని కల్గించింది. అంటరానితనం నిర్మూలించడానికి నెల్లూరు భంగీకాలనీలో కాపురం పెట్టి వాళ్ళల్లో ఆత్మస్థైర్యం కల్గించారు. అస్పృశ్యతా నిర్మూలన కోసం, హరిజన దేవాలయ ప్రవేశం కోసం ఆయన నెల్లూరునే వేదిక చేసుకొన్నారు.

నెల్లూరులోని మూలాపేటలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలోకి హరిజన ప్రవేశానికి మొదట నిరసన వ్రతం జరిగింది. 1946, మార్చి 1 నుంచి తాను నిరవధిక నిరసన వ్రతానికి పూనుకోబోతున్నట్లు గాంధీజీకి తెల్పుతూ, ఆయన ఆశీస్సులు అర్దిస్తూ శ్రీరాములు ఒక తంతి పంపాడు. గాంధీజీ ఆశీస్సులు పొందిన శ్రీరాములు హరిజన దేవాలయ ప్రవేశానికి వేణుగోపాలస్వామి దేవాలయాన్ని ఎన్నుకొని జరిపించారు.

### శ్రీరాములు దీక్ష :

శ్రీరాములు దీక్షను ప్రారంభిస్తే లక్ష్యాన్ని సాధించడమేనని ఆనాటి పత్రికలు, ఆనాటి ప్రజల విశ్వాసాన్ని ప్రకటించారు. ఆనాటి ఆంధ్రప్రభలోని సంపాదకీయం 'నిస్వార్థ సేవావ్రతుడు' అనే వ్యాసాన్ని విద్వాన్ గర్రె సత్యనారాయణగుప్త రాయడం జరిగింది.

శ్రీరాములు ఆత్మశక్తి ప్రజల హృదయాలలో అపూర్వ పరివర్తన తీసుకురాగలిగిందనీ, ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి కాలు అడ్డుపెడ్తూ వచ్చిన రాయలసీమ నాయకుల్ని సైతం ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి సుముఖంగా మలచగల్గిందనీ ఆనాటి తెలుగు దినపత్రికలు తెలియజేసినట్లుగా తెలుస్తుంది.

భాషాప్రయుక్త రాష్ట్రాల స్థాపన జరిగితే తప్ప నిర్మాణ కార్యక్రమం పటిష్టంగా అమలు జరగడం సాధ్యంకాబోదన్న అంశాన్ని పూర్తిగా పరిగణనలోకి తీసుకున్నారు శ్రీరాములు. మొదట్లో ఆంధ్రరాష్ట్ర స్థాపన వంటి రాజకీయ సమస్య పరిష్కారం కోసం, ఆచార్య రంగా, టంగుటూరి ప్రకాశం పంతులు వంటి ఉద్ధండ నాయకులు నిరశన వ్రతానికి పూనుకుంటే ఎంతో బాగుండును అని శ్రీరాములు ఎదురుచూశారు కూడా! అలా జరగకపోవడంతో బాటు, నిష్కామదృష్టితో, ద్వేషరహితంగా, నిశ్చింతగా ప్రాణాలర్పించడమే ఈ సమస్యకు పరిష్కారమన్న ధ్వని శ్రీరాములు అంతర్వాణి విన్పించడంతో, ఆ ప్రభోదమే ఆత్మార్పణ యజ్ఞానికి హేతువైంది.


శ్రీరాములు వంటి వ్యక్తి భావితరాల్లో ఇక జన్మించడంటే అతిశయోక్తి కాదు. చరిత్రలో శిబి చక్రవర్తి, ఏసుక్రీస్తు, శ్రీరాములు వంటి మహనీయులు మాత్రమే ప్రజల కోసం ప్రాణాలర్పించారు. ఈ కాలంలో ఇంకెవ్వరూ అలాంటి త్యాగధనులు రారు అంటే అతిశయోక్తి కాదు! ఆంధ్ర రాష్ట్ర సాధనకై అసువులు బాసిన అమరజీవి 125వ జయంతి సందర్భంగా ఘన నివాళి.

(మార్చి 16, శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి)



- చిన్ని నారాయణరావు
సెల్. 94402 02942

# ఉగాది రాక.. పరవశించే కోయిల!



దూబగుంట రామకృష్ణ
తిరుపతి. 9490108518

వసంతాల వేళ పసందైన వేళ
మావి చిగురు మేసి కోయలాట లాడే వేళ

గూటి లోని కోయిలమ్మ గొంతు విప్పి పాట పాడి
తరుల విరుల తావులను నిదుర నుండి లేపే వేళ
పసిడి వన్నె కాంతిగా సూర్య రశ్మి శోభలో
మెరిపించి మురిసేటి వేళ వసంతాల వేళ.

మల్లె జాజి పువ్వులు విరిసి మదిలోన కోరిక రేపి
పరిమళాల తేనెలనే పెదవి లోకి తెచ్చే వేళ
కొండ గాలి అలజడిలో మరులు గొలిపే రాగ భావం
మంజులంగ పలికే వేళ కోయలాట లాడే వేళ.

కళలు కనెడి ప్రకృతి కాంత డెందమందు ఆశపెంచి
పరవశాన ఊహలలో దరహాస మందెడి వేళ.
వసంతాల వేళ పసందైన వేళ మావి చిగురు మేసి
కోయలాడే వేళ వసంతాల వేళ పసందైన వేళ!..

# మంత్రి 'ఆనం'కి.. శృంగేరీ పీఠాధిపతి ఆశీస్సులు


శృంగేరీ పీఠాధిపతి ఆశీస్సులందుకుంటున్న మంత్రి ఆనం

మార్చి 11న శ్రీకాళహస్తికి వచ్చిన శృంగేరి పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతీ మహాస్వామీజీ నుంచి రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ఆశీస్సులు అందుకున్నారు. రాష్ట్రప్రభుత్వం తరఫున స్వామీజీని సాదరపూర్వకంగా స్వాగతించిన అనంతరం, స్వామీజీతో ఆనం భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రజలపై శృంగేరి గురువుల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆనం కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయం ఛైర్మెన్ కొట్టె సాయిప్రసాద్, ఆలయ ఇఓ వెంకటేశులు, ఆర్డీవో భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.




# రాష్ట్రపతి విందులో.. మన ఎంపీలు

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఏర్పాటు చేసిన అల్పాహార విందులో మన జిల్లాకి చెందిన ముగ్గురు ఎంపీలు పాల్గొన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఉన్న కల్చరల్ సెంట్రల్‌హాల్‌లో ఆంధ్రప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాలకు చెందిన పార్లమెంటు సభ్యులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భారత ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నిర్మలా సీతారామన్, జగత్ ప్రకాష్ నడ్డా, ఇతర ఎంపీలు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వారితో పాటు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు తదితరులు ఉన్నారు.

# కలెక్టర్ హిమాన్షును..మెచ్చుకున్న ముఖ్యమంత్రి

- భూ సమస్యలపై వినూత్న విధానానికి ప్రశంసలు


సమావేశంలో పాల్గొన్న హిమాన్షుశుక్లా

నెల్లూరుజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పనితీరును, భూముల వివాదాలను పరిష్కరించే విధానాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెచ్చుకున్నారు. ఈనెల 11న అమరావతిలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు నేతృత్వంలో భూ సమస్యల పరిష్కారానికి వినూత్న విధానంగా "వన్ మంత్, వన్ విలేజ్, ఫోర్ విజిట్స్' కార్యక్రమం అమలుచేయడం, అది సత్ఫలితాలు ఇస్తుండడాన్ని ప్రస్తావించారు. ఈ విధానాన్ని బాగా అమలుచేస్తున్నారని కలెక్టర్‌ని ప్రత్యేకంగా అభినందించారు. నెల్లూరుజిల్లాలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ఇతర జిల్లాల్లో కూడా అమలు చేయవచ్చని ముఖ్యమంత్రి సూచించడం విశేషం! ఈ వినూత్న విధానం ద్వారా గ్రామస్థాయిలోనే భూ వివాదాలను గుర్తించి, దశలవారీగా పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. భూ రికార్డులు, మ్యూటేషన్లు, సాదా బైనామా, డీకేటీ పట్టాలు, ఇళ్లస్థలాలు వంటి అంశాలపై వస్తున్న ఫిర్యాదులను సమగ్రంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోందన్నారు.


కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి పరిష్కరించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇప్పటివరకు డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో జిల్లాలో మొత్తం 110 గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, అందులో 26 గ్రామాల్లో భూ సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యాయని, మిగిలిన గ్రామాల్లో కూడా సమస్యల పరిష్కారం దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# ఆక్వా రంగానికి ఇబ్బంది లేదు

- స్పష్టం చేసిన ఆనం వెంకటరమణారెడ్డి



పశ్చిమాసియా దేశాల్లో యుద్ధం కారణంగా రొయ్యల ఎగుమతులు నిలిచిపోతాయని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న లేనిపోని ప్రచారాలు నమ్మొద్దని, ఆక్వారంగానికి ఏ ఇబ్బందీ లేదని ఏపీ అక్వాకల్చర్ డెవలప్‌మెంట్ వైస్‌ఛైర్మెన్ ఆనం వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 11న ఆయన నెల్లూరులోని మత్స్య శాఖ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. యుద్ధం వల్ల ఆక్వారంగం కుదేలైపోయిందని, షిప్పులు పోవడం లేదని, కంటైనర్లను వెనక్కి పంపుతున్నారంటూ వస్తున్న కథనాలు అవాస్తవాలని ఆయన తెలిపారు. కొంతమంది రొయ్యరైతులు భయపడిపోయి ముందుగానే రొయ్యలు పట్టేస్తున్నారని, తొందరపడి అలా చేయవద్దని సూచించారు. అలాంటిదేమైనా ఉంటే ప్రభుత్వమే ప్రకటిస్తుందని, రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో ఆక్వా సాగుచేసుకోవాలని వివరించారు.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com